ఆహ్లాదకరమైన వాతావరణంలో
గణేష్ ఉత్సవాలు
- విగ్రహాల ఏర్పాటు సమాచారం తప్పనిసరి
- ఉత్సవ కమిటీ, అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష 6

జోరు వాన
- ఉమ్మడి జిల్లాలో ముసురు
- ప్రాజెక్టులకు జలకళ..
- క్రమంగా నిండుతున్న చెరువులు
- అధికార యంత్రాంగం అప్రమత్తం



ఖమ్మం వద్ద మున్నేరు ప్రవాహం

ఖమ్మం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. దీంతో నిన్న మొన్నటి తీవ్ర వర్షాభావ పరిస్థితుల నుంచి రైతులకు ఉపశమనం లభించింది. ప్రస్తుత వర్షాలతో చెరవులు, వాగులు, ప్రాజెక్టుల్లోకి నీరు చేరుతుండటంతో పంటలకు ఊపిరి పోసినట్టయింది. జిల్లాలో వరి, పత్తి, మొక్కజొన్న, పెసర, కంది తోపాటు పలు కూరగాయల తోటలు సాగు చేస్తున్నారు. వరినాట్లు కూడా జోరందుకున్నాయి. సాగర్ ఎడమకాలువకు నీటి విడుదలతోపాటు సీతారామ ద్వారా ఏన్కూరు లింక్ కెనాల్ నుంచి గోదావరి జలాలు విడుదల చేయడంతో సాగర్ ఆయకట్టు కింద వరినాట్లు పడ్డాయి. కానీ ఇటీవల వర్షాభావ పరిస్థితులతో మెట్ట పంటలు వడబడుతుండగా ప్రస్తుత వానలు వాటికి ఊపిరిపోశాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో బుధవారం ఉదయం వరకు 6.7మి.మీ. సాధారణ వర్షపాతం నమోదవగా అత్యధికంగా ఎర్రుపాలెంలో 54.6 మి.మీ., నేలకొండపల్లిలో 16.6 మి.మీ., మధిర 16.2మి.మీ., ముదిగొండ 13.4మి.మీ., చొప్పున వర్షపాతం నమోదైంది.

క్రమంగా పెరుగుతున్న మున్నేరు..

జిల్లాలో పడుతున్న వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో ఖమ్మం వద్ద మున్నేరు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. సాధారణ నీటిమట్టం 16 అడుగులు కాగా 10 అడుగులకు చేరి రాత్రి 9గంటలకు 9.5 అడుగులకు తగ్గింది. కూసుమంచి మండలంలోని (మిగతా 6వ పేజీలో)

భారీ వర్షాల నేపథ్యంలో
ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- వరదలను ఎదుర్కొనేందుకు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధం
- ఫిర్యాదుకు 1077, 9063211298 టోల్ ఫ్రీ నెంబర్
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



6



నమూనా మాస్టర్‌ప్లాన్

క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారుల బృందం

భద్రాద్రి రామాలయ అభివృద్ధి మాస్టర్ ప్లాన్ కోసం వచ్చిన అధికారుల బృందం బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసింది. ఆలయ ప్రాంగణంతో పాటు ఆలయ పరిసరాలను నిశితంగా పరిశీలించి చేపట్టనున్న అభివృద్ధి పనులకు సం బంధించి నమూనా మాస్టార్‌ప్లాన్‌ను కలెక్టర్‌కు ప్రభుత్వ నియమిత ఆర్కిటెక్ట్ చూపించారు. ఈ సమయంలో కలెక్టర్ వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం స్థానిక చిత్రకూట మండపంలో మాస్టర్ ప్లాన్‌లో భాగంగా చేపట్టనున్న పనులపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ను ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి ఇచ్చారు.

భద్రగిరి ఆధ్యాత్మిక నగరి!
- చరిత్ర, సంస్కృతిని రక్షిస్తూ క్షేత్రం అభివృద్ధికి ప్రణాళికలు
- మంత్రి కొండా సురేఖ ఆదేశాలతో తుది మాస్టర్‌ప్లాన్‌కు కసరత్తు
- క్షేత్రస్థాయిలో కలెక్టర్, దేవాదాయ శాఖ స్థపతి, ఆర్కిటెక్ట్‌ల పరిశీలన

భద్రాచలం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాద్రి క్షేత్ర ప్రాశస్త్యాన్ని మరింత ఇనుమడింపజేసేలా.. పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణ శోభ మరింత ఇనుమడించేలా అభివృద్ధి చేసేలా రాష్ట్ర, జిల్లా అధికారులు తుది మాస్టర్‌ప్లాన్‌కు కసరత్తు చేపట్టారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాలతో కలెక్టర్ జితేష్ వి పాటిల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, దేవాదాయశాఖ స్థపతి వల్లినాయగన్, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి, దేవాదాయ శాఖ ఎస్ఈ కే.ఓం.ప్రకాష్, ఈఈలు శ్రీనివాసశర్మ, రమేష్, దేవాదాయ శాఖ అసిస్టెంటు కమిషనర్ ఎం.వీరస్వామి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చరిత్ర, సంస్కృతిని పరిరక్షిస్తూనే రామాలయ అభివృద్ధి పనులతో పాటు భద్రాద్రిలో ఆధ్యాత్మిక వాతావరణం మరింతగా వెల్లివిరిసేలా ఏర్పాట్లు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం భద్రాద్రి రామాలయ అభివృద్ధికి నమూనా మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించామన్నారు. పాంచరాత్ర ఆగమశాస్త్రం, దేవస్థానం వైదిక సిబ్బంది సలహాలు, సూచనలతో మాస్టర్ ప్లాన్‌కు తుది రూపు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. తద్వారా భద్రగిరి.. పూర్తిస్థాయి ఆధ్యాత్మిక నగరిగా మారనుందని పేర్కొన్నారు.

చేపట్టబోయే అభివృద్ధి పనులపై చర్చ

నమూనా మాస్టర్‌ప్లాన్ ఆధారంతో రామాలయ అభివృద్ధి పనులపై అధికారు లు చర్చించారు. ఆర్కిటెక్ట్ రూపొందించిన నమూనా మాస్టర్‌ప్లాన్‌ను ప్రదర్శించారు. అందులో నవీనంగా పాత కట్టడాలను తొలగించకుండా ప్రస్తుత అవసరాల దృష్ట్యా ఆలయం చుట్టూర కాలి నడక మండపాన్ని తూర్పువైపు నూతన మెట్ల మార్గం నిర్మించాల్సి ఉందన్నారు. అలాగే దక్షిణం పక్క విస్తరణ, ఉత్తరం పక్క కూడా మార్పులు చేస్తారని, చిత్రకూట మండపాన్ని దక్షిణం వైపు చేపట్టే పనుల్లో భాగంగా తొలగించే అవకాశం ఉందన్నారు. దక్షిణం వైపు విస్తరణలో భాగంగా నిత్య కల్యాణ మండపం, దర్బారు సేవ మండపం నిర్మించే విధానం నమూనాలో ఉన్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా చారిత్రకమైన సాంస్కృతికపరమైన నిర్మాణాలను, కట్టడాలను తొలగించమని జిల్లా కలెక్టర్‌కు ఆర్కిటెక్ట్ స్పష్టం చేశారు. 16, 17 శతాబ్దాల్లో చేపట్టిన నిర్మాణాలు, అనంతరం చేపట్టిన కీలక నిర్మాణాలను యథావిధిగా కొనసాగిస్తామన్నారు. అభివృద్ధి అనేది ఆలయానికే పరిమితం చేయకుండా భద్రాచలం కు పూర్తిగా విస్తరించేలా ప్లాన్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. కుసుమ హరినాధబాబా ఆలయం నుంచి భద్రాద్రి రామాలయం స్పష్టంగా కనిపించేలా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. అలాగే ఆలయం చుట్టూ స్థలంలో మార్పులు చేయకుం డా ఇదే సమయంలో వాటి వ్యత్యాసం బహిర్గతం కాకుండా రూపకల్పన చేసే ఆలోచన ఉన్నట్లు తెలిపారు. ప్రాకార మండపం, దశావతార గార్డెన్, తూము నరసింహదాసు ఆడిటోరియం, రామాయణం థీమ్ డిజిటల్ మ్యూజియం, ఏడు కాండాలతో ఏర్పాటు చేసే ఆలోచన ఉన్నట్లు వెల్లడించారు. అలాగే రూ.11 కోట్ల తో రామదాసు ప్లాజాను నిర్మించి ప్రసాదాల తయారీ, ఈవో కార్యాలయం, పరిపాలన విభాగం, టికెట్ బుకింగ్ సెంటర్‌లు జీ+2లో నిర్మించాలని (మిగతా 6వ పేజీలో)

తుది మాస్టర్‌ప్లాన్ రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తాం : వల్లినాయగన్

ఆగమ శాస్త్ర నిపుణులు, భద్రాద్రి దేవస్థానం వైదిక సిబ్బంది సలహాలు, సూచనలతో అవసరం మేరకు తాత్కాలిక మాస్టర్‌ప్లాన్‌కు మార్పులు చేసి తుది మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తామని దేవాదాయ శాఖ స్థపతి వల్లినాయగన్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. చారిత్రక పౌరాణిక ప్రాధాన్యం ఉన్న నిర్మాణాలను తొలగించడం జరగదన్నారు. తుది మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించిన అనంతరం ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.



మాస్టర్‌ప్లాన్‌పై చర్చిస్తున్న దృశ్యం

సన్న బియ్యానికి చేతి సంచులు
- రేషన్ లబ్ధిదారులకు పంపిణీ చేసేలా ప్రభుత్వ నిర్ణయం



వివరాలు 6లో..

యూరియా వెతలు
- గోపవరంలో తెల్లవారుజాము నుంచే రైతుల బారులు
- అవసరం మేరకే తీసుకోవాలంటున్న అధికారులు

6

అడవులను కాపాడుతూనే
అభివృద్ధి చేయాలి
- నెలరోజుల్లో డొంక రోడ్డు పూర్తిస్థాయిలో మంజూరు
- రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు
- రఘునాథపాలెం మండలం దొనబండ పర్యటనలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : అడవులను సంరక్షించుకుంటూనే ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులను చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. బుధవారం రఘునాథపాలెం మండలం దొనబండలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఒక సమావేశం ఏర్పాటు చేయాలని, ప్రజలు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూముల జోలికి వెళ్లొద్దని అధికారులకు సూచించారు. గ్రామాల్లో అవసరమైన డొంక రోడ్లను నెల రోజుల్లో మంజూరు చేయిస్తామని, నిరుపేదలు, అర్హత కలిగిన వారికి రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం చేసి ఇస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. అటవీ చట్టాలను గౌరవించాలని కొత్తగా ఎవ్వరూ అడవులు నరకటానికి వెళ్లొద్దని కోరారు. ప్రభుత్వం హక్కు పత్రాలు ఇచ్చిన పోడు భూముల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలని సూచించారు. గిరిజన విద్యార్థులకు మంచి విద్యా భవిష్యత్‌ను అందించేందుకు ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థలను ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. అధికారులు మానవీయ కోణంలో ఆలోచించి సంక్షేమ పథకాలను అందించాలన్నారు. త్వరలో బుగ్గవాగు నుంచి చెరువులకు నీరు అందేలా కార్యాచరణ చేస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఐటీడీఏ పీవో రాహుల్, జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

యాసంగి బోనస్..
ఇంకా రాలే!
- అందని రూ.63.63కోట్ల సన్న వడ్ల ప్రోత్సాహకం
- 18,893 మంది ఖమ్మం జిల్లా రైతుల ఎదురుచూపు



వైరా, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయ సీజ న్ మొదలై రెండున్నర నెలలు దాటిపోతున్నప్పటికీ గత ఏడాది యాసంగి సీజన్‌లోని సన్నరకాల ధాన్యానికి సంబంధించిన బోనస్ సొ మ్ము నేటికీ ప్రభుత్వం రైతులకు చెల్లించలేదు. ఖమ్మం జిల్లాలోని 18,893మంది రైతులు రూ.63.63కోట్ల బోనస్ సొమ్ము కోసం ఎదురు చూస్తున్నారు. యాసంగి సీజన్‌కు సంబంధించిన వరిధాన్యం కొనుగోళ్లు ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వరకు కొనసాగాయి. ఖమ్మం జిల్లాలోని 18893మంది రైతులు 1,27,271మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. ఈ సన్న రకం ధాన్యానికి సంబంధించి ప్రభుత్వం రూ.63.63కోట్ల బోనస్‌ను రైతు ల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. అయితే ఇంతవరకు ప్రభుత్వం ఏ ఒక్క రైతుకు కూడా నయా పైసా బోనస్ సొమ్మును చెల్లించలేదు. ఈ బోనస్ సొమ్ము రైతుల ఖాతాల్లో ఎప్పుడు జమచేస్తారో మిలియన్ డాల ర్ల ప్రశ్నగా ఉంది. రబీ సీజన్‌కు సంబంధించి ఖమ్మం జిల్లాలో 34,305 మంది రైతుల నుంచి 2,36,036మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. మొత్తం ధాన్యానికి ప్రభుత్వం రూ. 545.55కోట్ల నిధులను చెల్లించింది. ఈ మొత్తం ధాన్యంలో (మిగతా 6వ పేజీలో)

వీరుడా వందనం..
- అశ్రునయనాల మధ్య జవాన్ అనిల్ అంత్యక్రియలు పూర్తి
- నివాళులర్పించిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యే
- కుటుంబానికి అండగా ఉంటామన్న మేజర్ ప్రణబ్ కుమార్



గాల్లోకి కాల్పులు జరుపుతున్న ఆర్మీ సిబ్బంది

కారేపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ లోయలో సోమవారం ట్రక్కు బోల్తా పడిన ఘటనలో మృతిచెందిన ఆర్మీ జవాన్ బానోత్ అనిల్ (30) అంత్యక్రియలు కుటుంబసభ్యులు, బంధుమిత్రుల అశ్రునయాలు, సైనిక లాంఛనాల మధ్య బుధవారం పూర్తయ్యాయి. కశ్మీర్ నుంచి ప్రత్యేక విమానంలో అనిల్ భౌతిక కాయాన్ని హైదరాబాద్ తీసుకొచ్చిన 40మంది ఆర్మీ జవాన్ల బృందం.. బుధవారం ఉదయం ప్రత్యేక వాహనంలో అనిల్ స్వగ్రామమైన ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం సూర్యాతండాకు చేరుకుంది. ఈ క్రమంలో కామేపల్లి పోలీసు స్టేషన్‌వద్ద ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అనిల్ భౌతికకాయానికి నివాళులర్పించగా.. కారేపల్లి క్రాస్‌రోడ్డులో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ నివాళులర్పించారు. ఇక ఆ వాహనం సూర్యాతండాకు వెళ్లే రహదారిలో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థులు, ప్రజలు రాహదారికి ఇరువైపుల ఉండి జాతీయ జెండాలు చేతబూని 'జోహర్లు వీరుడా అనిల్' అంటూ నినాదాలు చేశారు.

స్వగ్రామంలో మిన్నంటిన రోదనలు

అనిల్ భౌతికకాయం సూర్యాతండాకు రాగానే కుటుంబసభ్యులు, బంధువుల రోదనలతో గ్రామం మిన్నంటింది. కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. ఏడు నెలల వయసున్న కుమారుడిని ఎత్తుకుని అనిల్ భార్య రేణుక గుండెలవిసేలా రోదించడం అక్కడి వారిని కలిచివేసింది. ఇక జవాన్ అనిల్ అంత్యక్రియలు పూర్తిగా సైనిక లాంఛనాల మధ్య నిర్వహించారు. మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపి గౌరవవందనం సమర్పించిన అనంతరం కుటుంబసభ్యులు అంతిమ సంస్కారాలు పూర్తిచేశారు. ఈ సందర్భంగా మేజర్ ప్రణబ్ కుమార్ అనిల్‌కు (మిగతా 6వ పేజీలో)



గోకినపల్లి వద్ద జరిగిన ప్రమాద స్థలంలో సాయిరంజిత్, శ్రీనివాస్ మృతదేహాలు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో
నలుగురి మృతి
- ఖమ్మం కరుణగిరి సమీపంలో ఆటో, బైక్ ఢీ
- ఇద్దరు అక్కడికక్కడే మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- గోకినపల్లి వద్ద డివైడర్‌ను ఢీకొట్టి కారు పల్టీ
- ఇద్దరు దుర్మరణం

7

భారీ వర్షాల నేపథ్యంలో
ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- వరదలను ఎదుర్కొనేందుకు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధం
- ఫిర్యాదుకు 1077, 9063211298 టోల్ ఫ్రీ నెంబర్
- ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి


మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తల కోసం బుధవారం తిరుమలాయపాలెం మండలంలో కలెక్టర్ పర్యటించారు. ఆజ్మీరా తండా శివారు, రాకాసితండా సమీపంలోని ఆకేరు నదిపై నిర్మించిన అక్విడెక్ట్ బ్రిడ్జి వద్ద వరద ప్రవాహాన్ని, నీటిమట్టాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో పూర్తి సంసిద్ధతతో స్థానికంగా ఉంటూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎగువ జిల్లాలు వరంగల్, మహబూబాబాద్‌లోని అధికారులతో సమన్వయం చేసుకుంటూ వరదను అంచనా వేస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. గతేడాది ఖమ్మంలో ఎదురైన ఇబ్బందులు మరోసారి పునరావృతం కాకుండా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో రోడ్డుపైకి ప్రజలు అనవసరంగా రావద్దని సూచించారు. అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో నీటి వనరులు తెగిపోకుండా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఉధృతంగా ప్రవహించే వాగులు చెరువుల సమీపంలోని రోడ్లు, వంతెనలపై రాకపోకలను అనుమతించవద్దని, దీనికి సంబంధించి తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా తట్టుకునేలా అధికారులు సిద్ధం కావాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, నీటిపారుదల శాఖ డీఈ రమేష్‌రెడ్డి, తహసీల్దార్ లూధర్ విల్సన్, ఎంపీడీవో సిలార్ సాహెబ్, వివిధ శాఖల అధికారులున్నారు.

అలుగులు పారుతున్న పాలేరు జలాశయం


పాలేరు జలాశయానికి కొనసాగుతున్న వరద

24 అడుగుల వద్ద నిలకడగా నీటిమట్టం


పాలేరు జలాశయాన్ని సందర్శించిన ఎస్ఈ మంగళపూడి

కూసుమంచి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పాలేరు జలాశయానికి వరద కొనసాగుతోంది. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు భారీ ఎత్తున వరదనీరు పాలేరు చేరుతోంది. అయితే ఎంతనీరు చేరుతుందో అదేస్థాయిలో దిగువకు పాలేరు ఏటిలోకి వదులుతున్నారు. ఎటువంటి ప్రమాదం తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. పాలేరు జలాశయంలో ప్రస్తుతం 24 అడుగుల మేర నీరు నిల్వ ఉంది. ఎగువ సాగర్ మొదటి జోన్ నుంచి 2168 క్యూసెక్కులు, వరద నీటి ద్వారా 8250 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. అదేవిధంగా రెండోజోన్ ఆయకట్టుకు 2043 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా, ఫాలింగ్ గేట్ల ద్వారా 8095 క్యూసెక్కుల నీరు ఏటిలోకి వదులుతున్నారు. అయితే బుధవారం రోజంతా వర్షం కురుస్తుండటంతో పాలేరుకు వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

సందర్శించిన ఇరిగేషన్ ఎస్ఈ

పాలేరుజలాశయాన్ని ఇరిగేషన్ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు సందర్శించారు. జలాశయానికి ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో అడిగి తెలుసుకున్నారు. ఎంతనీరు వస్తుందో, అదేస్థాయిలో దిగువకు విడుదల చేయాలని ఆదేశించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున రాత్రికి రాత్రే నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. వరద ప్రవాహాన్ని నీటి క్రమ లెవల్స్‌ను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఆయన వెంట డీఈ ఉన్నారు.

యూరియా వెతలు

- తెల్లవారుజాము నుంచే బారులు
- అవసరం మేరకే యూరియా తీసుకోవాలి : ఏవో
- రైతుల వద్దకు మాజీ ఎమ్మెల్యే చంద్రావతి


యూరియా కోసం ఉదయాన్నే సొసైటీకి చేరుకున్న రైతులు

కొణిజర్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు తెల్లవారుజామున నుంచి పడిగాపులు మొదలుపెట్టారు. బుధవారం నుంచి యూరియాను ఇస్తున్నారని తెలుసుకున్న రైతులు కొణిజర్లలోని గోపవరం సొసైటీ వద్దకు వచ్చి పడిగాపులు కాశారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి రైతులు సొసైటీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. సొసైటీ సిబ్బంది, వ్యవసాయాధికారులు, పోలీసుల భద్రత మధ్య యూరియాను రైతులకు అందించారు. అధికారులు రైతులకు చెప్పిన విధంగానే ఒక్కరోజులోనే 45 టన్నులు (1000 బస్తాలు) యూరియాను తెప్పించారు. వచ్చింది 45 టన్నుల యూరియా అయితే రైతులు మాత్రం అధికసంఖ్యలో వచ్చారు. వచ్చిన రైతులకు అధికారులు ఆధార్ కార్డు, తంబు నిబంధనలతో ఒక్కొక్క రైతుకు రెండు బస్తాలు చొప్పున రైతులకు అందించారు. రైతులు మాత్రం ఇది చాలదని, సరిపడా యూరియా ఇవ్వాలని కోరారు.

యూరియాను అవసరం మేరకే తీసుకోవాలి: ఏవో బాలాజీ

రైతులు యూరియాను అవసరం మేరకు తీసుకోవాలి. రైతులు కోసం సొసైటీ నందు 45 టన్నులు యూరియాను ఉంచటం జరిగిందని తెలిపారు. ప్రత్తికి గాని, వరికిగాని ఎకరానికి 20 కేజీల యూరియా మాత్రమే వాడాలని సూచించారు. రైతులు మోతాకు మించి యూరియాను వాడుతున్నారని తెలిపారు. కొంతమంది రైతులు యూరియాను అవసరాలకు కాకుండా చుట్టుప్రక్కల మండలాల్లో ఉన్న బంధువులకు యూరియాను పంపిస్తున్నారని అన్నారు. యూరియా కేంద్ర ప్రభుత్వం ద్వారా నెలవారి కోటా పద్ధతిలో మాత్రమే పంపుతారని, ఒకపంట కాలానికి కావలసిన యూరియా ఒకనెలలోనే పంపారని రైతులు గుర్తించాలని కోరారు. అవసరాలకు మాత్రమే యూరియాను తీసుకుంటే యూరియా కొరత రాదని తెలిపారు. గతేడాది జూలైలో 216 టన్నులు యూరియా ఇవ్వడం జరిగిందని, ఈ ఏడాది 396 టన్నులు ఇచ్చామన్నారు. ఒక్క జూలై నెలలోనే 180 టన్నుల యూరియాను ఇవ్వడం జరిగిందని తెలిపారు.



రైతులను ఇబ్బందిపెడితే సహించం : మాజీ ఎమ్మెల్యే చంద్రావతి

ప్రభుత్వం చెప్పేదానికి చేసేదానికి తేడా కనిపిస్తోంది. రైతులు తెల్లవారుజాము నుంచే యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారంటే అర్థం అవుతుంది. ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం కృషి చేస్తే యూరియా కొరత ఎందుకు వస్తుంది. గత కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు యూరియా కొరత వచ్చిందా అని వైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి ప్రశ్నించారు. బుధవారం ఆమె కొణిజర్లలోని సొసైటీ కార్యాలయం వద్దకు వచ్చి రైతులతో, అధికారులతో మాట్లాడారు. ప్రణాళిక లేకుండా ఎంత అవసరమో తెలుసుకోకుండా యూరియాని అందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు దళారీ వ్యవస్థ బాగుపడే విధంగా చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కిలారు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదకరమైన వాతావరణంలో గణేష్ ఉత్సవాలు

- విగ్రహాల ఏర్పాటు సమాచారం తప్పనిసరి
- ఉత్సవ కమిటీ, అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష



ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను నిర్వహించడానికి ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం వినాయక చవితి సందర్భంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై కల్లూరు డివిజన్ సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్, డీఆర్వో పద్మశ్రీతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 6 వరకు గణేష్ ఉత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆ రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని దీనికి తగినట్టు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు విధిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. గణేష్ మండపాలకు ప్రభుత్వం విద్యుత్ సరఫరా చేస్తుందని, జియో కో-ఆర్డినేట్స్‌తో సహా మండపాల వివరాలు అందించాలన్నారు. గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. విగ్రహం నిమజ్జనం చేసుకునేందుకు అవసరమైన రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలని, నిమజ్జనం రూట్‌లో అవసరమైన రోడ్డు మరమ్మతు పనులు వెంటనే చేపట్టి పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలోని డీఎల్పీవోలు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులకు నవరాత్రులు, నిమజ్జనం సందర్భంగా చేపట్టాల్సిన ప్రత్యేక పారిశుధ్య చర్యల గురించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలన్నారు. సమావేశంలో డీపీవో ఆశాలత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతిబాయి, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్, మునిసిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



తల్లాడలో బుల్లిరాజు సందడి

తల్లాడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సినీ బాలనటుడు బుల్లిరాజు బుధవారం తల్లాడలో సందడి చేశాడు. భీమవరం నుంచి హైదరాబాద్ వెళుతున్న బుల్లిరాజు మార్గమధ్యంలో ఉన్న తల్లాడలోని మట్టమ్మ హోటల్‌లో భోజనం చేసేందుకు ఆగాడు. ఈ సందర్భంగా హోటల్ నిర్వాహకులతో పాటు స్థానికులతో కలిసి ఫొటోలు దిగాడు. సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో నటించి తన నటనతో ప్రేక్షకాదరణ పొందాడు.

జోరు వాన

(5వ పేజీ తరువాయి)

పాలేరు జలాశయం నిండుకుండలా మారింది. పూర్తిస్థాయి నీటి మట్టమైన 23 అడుగులను దాటి అలుగులు పోస్తోంది. వైరా రిజర్వాయర్ 18 అడుగులకు గాను పూర్తిగా నిండటంతో జలకళ సంతరించుకుంది. సత్తుపల్లి మండలంలోని లంకాసాగర్ 16 అడుగులకు 10 అడుగులు మాత్రమే ఉంది. పాలేరు వాగు పొంగడంతో కూసుమంచి మండలంలో నర్సింహులగూడెం-కొత్తూరు మధ్య, జీళ్లచెరువు-చేగొమ్మ తదితరగ్రామాలకు రాకపోకలు నిలిచాయి. జిల్లాలో రఘునాథపాలెం, కామేపల్లి, ఏన్కూరు, కొణిజర్ల తదితర మండలాల్లో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చెరువుల్లో కూడానీటి మట్టం పెరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా 1,100చెరవులుండగా వంద చెరువులు వరకు నూరుశాతం నిండాయి. మిగిలిన చెరువుల 50శాతం నిండగా మిగిలిన చెరువులు 25శాతం నిండాయి. బుధవారం రాత్రి కూడా ఉధృతంగా వర్షం పడుతుండడంతో చెరువులు పూర్తిగా నిండే అవకాశం ఉంది.

యంత్రాంగం అప్రమత్తం

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్న అధికారుల ఆదేశాలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ మేరకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునిల్‌దత్ ఆదేశాలిచ్చారు. వాగులు పొంగతున్న చోట రాకపోకలు లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించాలని సూచించారు. నీటి ప్రవాహాల వద్దసెల్ఫీలు తీసుకునేందుకు ఎవరు వెళ్లవద్దని హెచ్చరించారు. బుధవారం రాత్రి కూడా భారీవర్షాలు కురిస్తే గురువారం ఉదయానికి పలుచోట్ల వాగులు ఉప్పొంగి.. రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది. కాగా కురుస్తున్న వర్షాలతో పలుచోట్ల వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. వాహనాలు అదుపుతప్పుతున్నాయి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో..

కొత్తగూడెం, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లాలో పలు మండలాల్లో బుధవారం ఉదయం స్వల్ప వర్షపాతం నమోదవగా.. రాత్రికి భారీ వర్షం పడింది. మంగళవారం రాత్రి నుంచి జల్లులు పడగా.. బుధవారం ఉదయం వరకు జిల్లాలో అత్యధికంగా చర్ల మండలంలోని సత్యనారాయణపురంలో 4.35 సెంమీ, దమ్మపేట మండలం అంకంపాలెంలో 4 సెంమీ, పినపాక మండలం ఏడూళ్ల బయ్యారంలో 2.73, మణుగూరులో 2.48, దుమ్ముగూడెంలో 2.3, అశ్వాపురంలో 1.8, ఇల్లెందులో 1.5, ఆళ్లపల్లి, బూర్గంపాడులో 1 సెంమీ వర్షపాతం నమోదుకాగా.. మిగిలిన మండలాల్లో ఒక సెంమీ లోపే వర్షపాతం నమోదైంది. కాగా బుధవారం ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఆటోమాటిక్ వేదర్ స్టేషన్లలో రికార్డయిన వివరాల ప్రకారం చంద్రుగొండ మండలం మద్దుకూరులో 3.8 సెంమీ, జూలూరుపాడులో 1.75 సెంమీ వర్షపాతం నమోదైంది.

మద్యంమత్తులో యువకుల వీరంగం

- రోడ్డుపై వాహనాలు ఆపుతూ హల్‌చల్
- పెట్రోల్ పోసి ద్విచక్ర వాహనం దహనం
- పోలీసులకు ఇరువర్గాల ఫిర్యాదు


షాపు ఎదుట మంటలు

ఖమ్మంక్రైం, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కొందరు యువకులు వీరంగం సృష్టించిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి ఖమ్మం నగర శివారులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపురానికి చెందిన రుడావత్ రాకేష్, కొండూరి ఉమేష్, కొత్తపల్లి శ్రీనాథ్, మహేష్‌తో పాటు కొందరు యువకులు గోపాలపురం సమీపంలోని రోడ్డుపక్కన ఉన్న ఓ బెల్టుషాపు వద్దకు రెండు ఆటోల్లో వచ్చి మద్యం తాగారు. మద్యం మత్తులో వారు రహదారిపై వెళుతున్న వాహనాలకు అడ్డంగా వెళుతూ వాహనదారులను ఇబ్బందులు పెట్టారు. రాకేష్ అనే యువకుడు ఏకంగా రోడ్డుపై పడుకున్నాడు. ఈక్రమంలో అక్కడున్న బెల్టుషాపు యజమాని బానోతు లక్ష్మి, బానోతు వేణు వారిని ఆపే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో మాటా మాటా పెరిగింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న ఆ యువకుడు 'మా ఇష్టం వచ్చినట్టు చేస్తాం.. మీరెవరుఅడగడానికి ?' అంటూ వేణుపై దాడిచేశారు. దీంతో పక్కనే ఉన్న వేణు సోదరి బానోతు కవిత, ఆమె భర్తవినోద్ వచ్చి దాడి చేస్తున్న వారిని ఆపే ప్రయత్నం చేయగా.. వారిపై కూడా విచక్షణారహితంగా దాడిచేస్తుండడంతో వారు పారిపోయి రోడ్డుపక్కన ఉన్న ఓ షాపులోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. దీంతో రాకేష్ షాపు వద్దకు వచ్చి షాపులో ఉన్నపెట్రోల్ డబ్బా తీసుకుని షాపు యజమాని ద్విచక్రవాహనంపై పోసి నిప్పంటించాడు. లోపలున్నవారు కేకలు వేయడంతో సమీపంలోని కొంతమంది వచ్చి ద్విచక్రవాహనంపై మంటలను ఆర్పివేశారు. అనంతరం రాకేష్‌తోపాటు మరికొంతమంది కలిసి షాపులో ఉన్నవారిపై రాళ్లు విసిరారు. ఈదాడిలో బానోతు వేణు, వినోద్‌కు గాయాలయ్యాయి. స్థానికులు ఖానాపురం పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి బాధితుల ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయినా అంతటితో ఆగకుండా సదరు యువకులు ప్ర భుత్వ ఆసుపత్రికి వద్దకు వెళ్లగా.. అక్కడ ఇరువర్గాల మధ్య మళ్లీ గొడవ జరిగింది. అయితే రాకేష్ అనే యువకుడు గంజాయి తాగడం, అమ్మడం లాంటివి చేస్తుంటాడని, అతడిపై గతంతో ఓపోలీసుస్టేషన్‌లో గంజాయి కేసు కూడా నమోదయినట్టు సమాచారం. అదేవిధంగా గతంలో కూడా సదరు షాపు యజమానులపై రాకేష్ దాడి చేసినట్టు తెలుస్తోంది. మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఘటనపై ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఖానాపురంహవేలి పోలీసులు కేసు నమోదు చేశారు.

వీరుడా వందనం..

(5వ పేజీ తరువాయి)


అనిల్ అంతిమయాత్రలో పాల్గొన్న యువకులు, స్థానికులు

జరిగిన ప్రమాదం గురించి పూర్తిగా వివరించారు. జవాన్ అనిల్ విధి నిర్వహణలో అసువులు బాసాడని, దీంతో క్రేంద ప్రభుత్వం ద్వారా కుటుంబానికి రావాల్సిన అన్ని వసతులను సమకూరుస్తామని, కుటుంబానికి పూర్తిగా అండగా ఉంటామని రేణుకకు ధైర్యం చెప్పారు. అనిల్ అంత్యక్రియలకు జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ హుస్సేన్ నాయక్, తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో రవీంద్రప్రసాద్, సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ గోపి, బీఆర్ఎస్ నాయకులు గిరిబాబు, బాణోత్ మంజుల, నెల్లూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు. వందలాది మంది ఎనిమిది కిలోమీటర్ల మేర బైకు ర్యాలీ నిర్వహించారు.

మంత్రి తుమ్మలను కలిసిన
కల్లూరు సబ్ కలెక్టర్

దమ్మపేట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును బుధవారం కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలోని గండుగులపల్లిలో మంత్రి తుమ్మలను ఆయన స్వగృహంలో కలిశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మంత్రి తుమ్మల సబ్ కలెక్టర్‌కు సూచించారు. మంత్రి తుమ్మలను ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు కొయ్యల అచ్యుతరావు, మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరావు, ఎర్రా వసంతరావు కలిశారు.





ఈ ఫొటోలు చూశారా.. వర్షానికి ఖమ్మం ఎన్టీఆర్ సర్కిల్‌లో ఓ ద్విచక్రవాహనదారుడు ఇదిగో ఇలా స్కూటీ అదుపుతప్పి కిందపడ్డాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసు ఒకరు ద్విచక్రవాహదారుడి వద్దకు వచ్చి.. ఆయన్ను లేపి అక్కడి నుంచి పంపించారు. ఈ దృశ్యాలను చూసిన వారు ఆ పోలీసును అభినందించారు.

- ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

సన్న బియ్యానికి చేతి సంచులు


గోదాముకు చేరిన చేతిసంచుల బేళ్లు

వైరా, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్‌కార్డుదారులు తీసుకునే సన్నబియ్యం కోసం చేతిసంచులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రంగాన్ని సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలతో ఆరు గ్యారెంటీల అభయహస్తం లోగోలో ఇందిరాగాంధీ ఫొటోను అందరికీ సన్నబియ్యం, ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం, తెలంగాణ పౌరసరఫరాలశాఖ ప్రగతి పథం, సకలజనహితం మన ప్రజాప్రభుత్వం అనే నినాదాలతో ముద్రించిన చేతిసంచులను పంపిణీ చేసేందుకు సన్నాహాలు పూర్తిచేసింది. ఇప్పటికే రాష్ట్ర పౌరసరఫరాలశాఖ ఆధీనంలో నడుస్తోన్న అన్ని ఎంఎల్ఎస్ గోదాములకు ఈ చేతి సంచుల బేళ్లను పంపించింది. జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యాన్ని పంపిణీ చేశారు. మళ్లీ సెప్టెంబరులో మూడు నెలలకు సంబంధించి సన్నబియ్యాన్ని కార్డుదారులకు పంపిణీ చేయనున్నారు. సెప్టెంబరులో ఇచ్చే సన్నబియ్యంతో పాటు చేతిసంచులను కూడా కార్డుదారులకు పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ ఏర్పాట్లు చేసింది. ఉమ్మడి ఏపీలో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో రేషన్ షాపుల ద్వారా బియ్యంతో పాటు తొమ్మిది రకాల నిత్యావసర వస్తువులను చేతిసంచిలో ప్యాకచేసి అందజేశారు. అయితే ఇప్పటి ప్రభుత్వం కేవలం సన్నబియ్యాన్ని మాత్రమే సరఫరా చేస్తుంది. ఏ ఒక్క నిత్యావసర వస్తువు కూడా చౌకధర దుకాణాల్లో సరఫరా చేయడం లేదు. అయినప్పటికీ ప్రభుత్వం 20నెలల తర్వాత ఈ చేతిసంచుల పంపిణీకి ఏర్పాట్లు చేసింది.

యాసంగి బోనస్.. ఇంకా రాలే!

(5వ పేజీ తరువాయి)

18893మంది రైతులకు చెందిన 1,27,271మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం, 15,412మంది రైతులకు చెందిన 1,08,765మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసిన కేంద్రాల్లో కొనుగోలు చేశారు. సన్న, దొడ్డురకం ధాన్యానికి అసలు సొమ్ము రూ. 545.55కోట్లు చెల్లించారు. ఇకపోతే సన్నరకం ధాన్యం బోనస్ సొమ్ము రూ.63.63కోట్లు పెండింగ్‌లో ఉంది. నేలకొండ పల్లిలో 3450మంది, తల్లాడలో 1890మంది, కూసుమంచిలో 2202 మంది, కల్లూరులో 1310, ముదిగొండలో 1980, వేంసూరులో 1420, పెనుబల్లిలో 1053, తిరుమలాయపాలెంలో 1282, సత్తుపల్లిలో 1056, ఖమ్మం రూరల్‌లో 986, వైరాలో 260, కొణిజర్ల 732, చింతకానిలో 394, రఘునాథపాలెంలో 302, ఏన్కూరులో 170, బోనకల్‌లో 173, మధిరలో 62, కామేపల్లిలో 70, ఖమ్మం అర్బన్‌లో 58, ఎర్రుపాలెంలో 16, సింగరేణిలో 27మంది రైతులు బోనస్ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది జూన్ నుంచి ఖరీఫ్(వానాకాలం) వ్యవసాయ సీజన్ మొదలై రైతులు వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలను సాగుచేశారు. ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అయినకాడికి వడ్డీ ఒప్పందం చేసుకొని పెట్టు బడుల కోసం అప్పులు చేశారు. ఈబోనస్ సొమ్ము వ్యవసాయ పెట్టుబ డులకు ఉపకరిస్తుందని ఆశించిన రైతులకు నేటికీ నిరాశే మిగిలింది. ఒకవేళ ప్రభుత్వం ఆలస్యంగా బోనస్ సొమ్ము చెల్లించినప్పటికీ పెట్టుబ డుల కోసం ప్రైవేట్ వ్యాపారుల వద్ద తెచ్చిన సొమ్ముకు వడ్డీలు చెల్లించేందుకు కూడా సరిపోవని అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే బోనస్ సొమ్ము తమ ఖాతాల్లో జమ చేయాలని కోరుతున్నారు.

భద్రగిరి.. ఆధ్యాత్మిక నగరి

(5వ పేజీ తరువాయి)

భావిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా భద్రాచలంకు వచ్చే రామ భక్తులు బూర్గంపాడు మండలంలోని రెడ్డిపాలెంలోనే విడిది చేసేలా రూ.82 కోట్లతో హోటళ్ల, వసతి నిర్మాణ ం చేపట్టే భవిష్యత్తు ప్రణాళిక ఉందన్నారు. అదేవిధంగా ఏపీలోని పురుషోత్తపట్నంలో రామవనం, నక్షత్రవనం, తులసివనంలను ఏర్పాటు చేసే ప్రణాళిక ఉం దన్నారు. అలాగే గోదావరి ఘాట్ వద్ద ప్రధానంగా నదీ హారతి సమర్పించడానికి ప్రత్యేక వేదికను నిర్మించే యోచన ఉందన్నారు. ఆ నిర్మాణంలో పటిష్ఠమైన విధానాన్ని చేపట్టాలని కలెక్టరు సూచించారు.

శ్రీరంగం మాదిరిగా భద్రాద్రి

తమిళనాడులోని శ్రీరంగంలో గోపురాలు పట్టణంలోని నివాస ప్రాంతాలను తాకుతూ నిర్మించడం జరిగింది. అదే మాదిరిగా భద్రాచలంలో సైతం ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా వివిధ రకాల చిత్రాలను ఏర్పాటు చేసే ఆలోచన ఉందన్నారు.




"విదేశీయుల పాలన నుంచి భారతదేశ విముక్తి లక్ష్యంగా సాగిన పోరాటాలు, ఉద్యమాలు, మహనీయుల త్యాగాల ఫలితం ఈనాడు మనమంతా అనుభవిస్తున్న స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు. తెలుగు నేల మీద సంఘ సంస్కరణోద్యమం, జాతీయోద్యమం కలగలిసి... మానవీయ విలువలకు పట్టంకట్టిన అద్భుతమైన కాలం అది. ఆ మహత్తర ఉద్యమాలకు ప్రత్యక్ష సాక్షులు మాత్రమే కాదు, అందులో భాగస్వాములు... గుత్తా జవహరీబాయి, రావూరి మనోరమ, ఏటుకూరి కృష్ణమూర్తి. 'స్వరాజ్యం మా జన్మహక్కు..' అని నినదించి జైలుకు వెళ్లిన, ఆ ముగ్గురు స్వాతంత్ర్య సమరయోధులను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'నవ్య' పలకరించింది.

ఆ త్యాగాలకు ఏదీ విలువ?

రహస్యంగా పత్రికలు బట్వాడా చేశా...

- ఏటుకూరి కృష్ణమూర్తి, 104 ఏళ్లు

"సామాజిక మార్పును కోరే కమ్యూనిస్టులే కలసి పని చేయలేకపోతున్నారు. ఇక సామాన్యులు ఐకమత్యంతో ఉండాలని కోరుకోవడం అత్యాశ అవుతుందేమో. గుంటూరు టౌన్ హైస్కూల్లో ఎస్ఎల్‌సీ చదువుతున్న రోజుల్లో 'క్విట్ ఇండియా' ఉద్యమానికి మద్దతుగా మేము నిరసన సభ నిర్వహించాం. కొందరు స్నేహితులం కలసి లాలాపేట పోలీస్ స్టేషన్‌మీద జాతీయ జెండా ఎగరేశాం. దాంతో పోలీసులు మమ్మల్ని అరెస్టు చేసి గుంటూరు సబ్ జైలులో నిర్బంధించారు. మాకు సంఘీభావంగా స్థానికులు పెద్ద సంఖ్యలో పరామర్శకు వస్తుండడంతో... మమ్మల్ని బాపట్ల, మంగళగిరి... అలా రకరకాల ప్రదేశాలు తిప్పారు. మేము నాలుగు నెలలకు పైగా జైలు జీవితం గడిపాం. దేశభక్త కొండా వెంకటప్పయ్య గారి మనుమలు నాకు మంచి స్నేహితులు. వారి ఇంటికి తరచుగా వెళ్లేవాణ్ణి. మరోవైపు ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు లాంటి నాయకులను కలిసేవాణ్ణి.



ఆర్మీలో తిరుగుబాటు...

మా బాబాయి ఏటుకూరి జోగిరాజు సైమన్ కమిషన్ వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన స్ఫూర్తితోనే నేనూ జాతీయోద్యమంలోకి వెళ్లాను. విజయవాడ నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ 'స్వతంత్ర భారత్' పత్రిక ప్రచురించేది. ఆ పత్రికను గుంటూరులోని జాతీయోద్యమ నాయకులకు పంచే బాధ్యత నాది. అలా రహస్యంగా చాలాకాలం ఆ పత్రికల్ని బట్వాడా చేశాను. కొన్నాళ్లకు 'బ్రిటిష్ - ఇండియా ఆర్మీ'లో చేరాను. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా రాయల్ ఇండియన్ నేవీ సైనికులు తిరుగుబాటు ప్రారంభించారు. వారికి మద్దతుగా నేనూ నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నాను. మమ్మల్ని అరెస్టు చేసి, లాహోర్ జైల్‌లో కొన్నాళ్లు నిర్బంధించారు. దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించిన తర్వాత మమ్మల్ని విడుదల చేశారు. ఆ వెంటనే ఆంధ్రా రెవెన్యూ శాఖలో ఉద్యోగిగా కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో చేరాను. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులకు నావంతుగా సహకారం అందించాను. ప్రస్తుతం స్వాతంత్ర్య సమరయోధుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నాను. రోజూ దినపత్రికలే నా కాలక్షేపం."

అమ్మతో కలసి జైలుకెళ్లాను

- రావూరి మనోరమ, స్వాతంత్ర్య సమరయోధురాలు, 98 ఏళ్లు

"సొంత గొడవే కానీ స్వాతంత్ర్యోద్యమ విలువలు ఈనాడు పట్టినదెవరికి? ఆనాడు అంతా ఒక్కటై దేశంకోసం పోరాడాం. ఈనాడు ఎవరికి వారు గొప్పగా బతకాలని ప్రతిఒక్కరూ ఆరాటపడుతున్నారు. వ్యక్తిగత స్వార్థం పెరిగింది. మనం ఇవాళ అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు తమకు పుట్టుకతోనే వచ్చినవేనన్నది ఈ తరం అభిప్రాయం. అవి ఎందరో మహనీయుల పోరాటాలు, త్యాగాల ఫలితంగా సిద్ధించాయన్న కనీస స్పృహ, ఆలోచన నేటి యువతీ, యువకుల్లో లేకపోవడం బాధాకరం. ఉద్యోగరీత్యా ఎన్నో మంచి అవకాశాలను సునాయాసంగా వదిలి జాతీయోద్యమానికి అంకితమయ్యారు మా నాన్న గోపరాజు రామచంద్రరావు (గోరా). సమాంతరంగా ఆంధ్ర దేశంలో కుల నిర్మూలనోద్యమానికి నాయకత్వం వహించారు. నాస్తికోద్యమంలో ఆయనకు శిష్యుడైన రావూరి అర్జునరావుతో నాకు వివాహం జరిపించి గొప్ప ఆదర్శవాదిగా నిలిచారు. ఇప్పుడు ఆ నిబద్ధత, చిత్తశుద్ధి, నిజాయితీ సమాజంలో పెద్దగా కనిపించడం లేదు.

క్విట్ ఇండియా పోరాటం...

ఒక్క స్వాతంత్ర్య పోరాటమే కాదు, సామాజిక మార్పు కోసం మా నాన్న తలపెట్టిన ప్రతి సంఘ సంస్కరణ ఉద్యమంలో అమ్మ సరస్వతీ గోరాతో పాటు మేమంతా పాల్గొన్నాం. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో విజయవాడలోని ఒకచోట అమ్మ, మా మేనత్త సామ్రాజ్యంతో పాటు నేను, మరి కొంతమంది మహిళలం సమావేశమయ్యాం. అప్పుడు నా వయసు 14 ఏళ్లు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలిస్తూ ర్యాలీకి అలా కదిలామో లేదో... మమ్మల్ని పోలీసులు అరెస్టు చేశారు. విజయవాడ సబ్ జైలులో కొన్ని రోజులు నిర్బంధించిన తర్వాత... మమ్మల్ని రాయవెల్లూరు జైలుకు తరలించారు. కారాగారం అనే మాటే గానీ... ఆట, పాటలతో చాలా సందడిగా ఉండేది. ఒకరితో ఒకరు ఎంతో ప్రేమతో, ఆప్యాయతతో మెలిగేవాళ్లు. జైలర్లు కూడా మమ్మల్ని చాలా గౌరవంగా చూసేవారు. ఆ ఆరునెలల జైలు జీవితం మరచిపోలేని జ్ఞాపకాలను మిగిల్చింది.

మహాత్ముడు నిర్ణయించిన ముహూర్తం...

అర్జునరావుతో నాకు వివాహం నిశ్చయించిన తర్వాత ఆ విషయాన్ని గాంధీగారికి మా నాన్న చెప్పారు. బులుసు సాంబమూర్తి గారి ద్వారా నా ఇష్టాయిష్టాలను తెలుసుకున్న తర్వాత... 'సేవాగ్రామ్‌లో తన చేతుల మీదుగా మా పెళ్లి జరిపిస్తా'నని మహాత్మా గాంధీ మాట ఇచ్చారు. అయితే... రెండేళ్లు ఆగమన్నారు. నాకు తూర్పుగోదావరి జిల్లాలోని కస్తూర్బా ఆశ్రమంలో జీవన నైపుణ్యాల శిక్షణ ఇప్పించాల్సిందిగా ఆదేశించారు. అర్జున్‌రావును తన వెంట వార్ధాకు తీసుకువెళ్ళారు. ఏడాది తర్వాత ఒక రోజు... 1948, మార్చి 13న మా వివాహానికి మహాత్మాగాంధీ ముహూర్తం ప్రకటించారు. అంతా సవ్యంగా సాగుతోందని అనుకుంటున్న సమయంలో... ఆ ఏడాది జనవరి 30న గాంధీ హత్యకు గురయ్యారు. బాపూజీ లేకపోయినా, ఆయన నిర్ణయించిన ముహూర్తానికి సేవాగ్రామ్‌లోని కస్తూర్బా కుటీరం దగ్గర ఆనాటి దేశ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ లాంటి మహనీయుల సమక్షంలో... అర్జునరావు, నేను నూలుదండలు మార్చుకొని వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టాం. అతిథులకు వేపిన వేరుశెనగపప్పు, బెల్లం పంచారు.

లోక్‌నాయక్ పరామర్శ...

వివాహానంతరం కృష్ణాజిల్లా వానపాములలో కొన్నాళ్లు ఉన్నాం. ఆ సమయంలో నా యోగక్షేమాలు తెలుసుకోవడంకోసం లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణగారు ఆ ఊరు వచ్చారు. గ్రామంలోని దళితవాడలో మేము నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు చూసి మెచ్చుకొన్నారు. తర్వాత 1960 నుంచి నలభై ఏళ్లకు పైగా గుడివాడలో 'అంబేద్కర్ హరిజన బాలికా వసతి గృహం' నడిపాం. వారందరికీ నేనే స్వయంగా వండి వడ్డిస్తే, అమ్మాయిల చదువు బాధ్యతను అర్జునరావు చూసుకున్నారు. అలా ఎంతో మంది నిరుపేద అమ్మాయిలకు తల్లిదండ్రులుగా మారి, చేతనైన సాయం అందించడానికి ప్రయత్నించాం. ఒంట్లో ఓపికున్నంత కాలం పార్టీ రహిత ప్రజాస్వామ్యాన్ని, నాస్తికవాదాన్ని విస్తృతంగా ప్రచారం చేశాం. ఇప్పుడు మా పిల్లలు మిలాప్, చునావ్, సాదిక్, పవర్, అమ్మాయి నూయజ్ కలసి 'మార్పు' ట్రస్ట్ ద్వారా కొన్నిసామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సంపూర్ణ స్వాతంత్ర్యం రాలేదు

- గుత్తా జవహారి బాయి, 102 ఏళ్లు

"పెద్ద వయసు వల్ల కాలు బయట పెట్టలేకపోయినా, బయట ఏం జరుగుతోందో నాకు తెలుసు. టెలివిజన్‌లో ముఖ్యమైన వార్తలు ప్రతిరోజూ తప్పనిసరిగా చూస్తాను. నేటి రాజకీయాలు బాగోలేవు. అంతా స్వార్థం, అవినీతి, నిలకడలేనితనం. స్వాతంత్ర్యం వచ్చి 78ఏళ్లు అయినా... ఈ దేశంలో ఇంకా కూడు, గూడులేనివారు ఎంతోమంది ఉన్నారంటే, సంపూర్ణ స్వాతంత్ర్యం రాలేదనే కదా అర్థం! ఏమయ్యాయి ఆనాటి స్వాతంత్ర్యోద్యమ ఆశలు, ఆకాంక్షలు? జాతీయోద్యమంలో మా కుటుంబం మొత్తం పాల్గొని జైలుకు వెళ్లింది. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న కారణంగా నా భర్త గుత్తా సుబ్రహ్మణ్యం సోదరులు రామానుజయ్య, రాఘవయ్య, చలమయ్య, మా ఆడపడుచు రాజారత్నం, నా పెద్ద తోటి కోడలు సుందరమ్మ... వీరంతా జైలు శిక్ష అనుభవించారు. సుందరమ్మ అయితే విష జ్వరంతో బాధపడుతూ రాయవెల్లూరు జైలులోనే మరణించింది. 'బ్రిటిష్ ప్రభుత్వం నశించాలి', 'స్వాతంత్ర్యం కావాలి' అని రోడ్డుమీద నినాదాలు చేసినందుకు నన్నూ అరెస్టు చేసి, కొద్దిరోజులు జైల్లో ఉంచారు.

నేతాజీకి మా నాన్న స్నేహితుడు

నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌కు మా నాన్న గుంటూరు సుబ్బారావు మంచి స్నేహితుడు. కోల్‌కతా ఒరియంటల్ కాలేజీలో వారిద్దరికీ పరిచయం. వారిమధ్య చాలాకాలం ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా నడిచాయి. నేతాజీ స్ఫూర్తితో మా నాన్న కూడా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. నాన్నకు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో సత్సంబంధాలున్నాయని తెలిసి పోలీసులు చాలారోజులు ఆయనను వెంటాడారు. అటు నా పుట్టింటివారు, ఇటు మెట్టినింటి వారు స్వాతంత్ర్యోద్యమంతో పాటు సంఘ సంస్కరణోద్యమంలోనూ భాగమయ్యారు. ఇప్పుడు ఆ విలువలను కొనసాగించడానికి యువత ముందుకు రావాలి. మహనీయుల వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలి."

● సాంత్వన్, ఫొటోలు: హరిప్రేమ్



రెండు కార్లు ఢీ.. ఓ కారులో చెలరేగిన మంటలు


అప్రమత్తమై బయటకు వచ్చిన ముగ్గురు వ్యక్తులు
త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
ఖమ్మం జిల్లా ఏన్కూరులో ఘటన

ఏన్కూరు, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): రెండు కార్లు ఢీ కొన్న ఘటనలో ఓ కారు పూర్తికాలిపోయింది. అయితే ఆ కారులో ఉన్న ముగ్గురు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం దూగుట్ట సమీపంలో బుధవారం జరిగింది. దీనికి సంబంధించిన వివరాలివీ.. కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు వెళుతున్న కారు, ఖమ్మం నుంచి చంద్రుగొండ వైపు వెళుతున్న కారు ఏన్కూరు మండలం జన్నారం రహదారిలోని దూగుట్ట సమీపంలో గుంతలను తప్పించబోయి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఖమ్మం వైపు వెళుతున్న హైదరాబాద్‌కు చెందిన వారి కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అయితే అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు డోర్లు తెరుచుకుని వెంటనే బయటకు రాగా.. వారు బయటకు వచ్చిన వెంటనే మంటలు మరింత వ్యాపించి కారు పూర్తిగా దహనమైంది. ఈ కారులోని వారు హైదరాబాద్ జీడిమెట్లకు చెందిన సరికొండ సాయిష్, భూక్య విష్ణుతో పాటు మరొకరు ఉన్నారని, వారు కొత్తగూడెంలో జరిగిన శుభకార్యానికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది తెలుస్తోంది. ఇక చంద్రుగొండ వైపు వెళుతున్న కారులో ఇద్దరు ప్రయాణిస్తుండగా.. వారు ఖమ్మంలో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. వీరిలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే డయల్ 100కు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. కారులో ఉవ్వెత్తున మంటలు వ్యాపించడంతో రోడ్డుకి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చెట్టే కదా అని నరికేస్తే..

రూ.25 వేల జరిమానా కట్టించారు!

● ఖమ్మంలో చర్చనీయాంశంగా మారిన ఘటన



జరిమానా విధిస్తున్న ఉద్యాన శాఖ అధికారి బెల్లం రాధిక

ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : అదో ప్రైవేట్ విద్యా సంస్థ. విద్యార్థులకు మొక్కలు పెంపకం, వృక్షాలు అవసరం పర్యావరణం పరిరక్షణపై నిత్య బోధనలు చేసే విద్యాలయం. అయితే ఆ విద్యాలయం బోర్డుకు ఒక చెట్టు అడ్డొచ్చిందని విద్యాసంస్థ నిర్వాహకులు బుధవారం అందరూ చూస్తుండగానే చెట్టును నరికేశారు. మిషన్ తీసుకొచ్చి నిమిషాల్లో నేలమట్టం చేశారు. చైతన్యవంతమైన ఖమ్మం నగర ప్రజలు ఊరుకుంటారా.. వెంటనే అధికారులకు ఫిర్యాదు చేశారు. రయ్యూమంటూ నిమిషాల్లో అక్కడ వాలిపోయిన కేఎంసీ ఉద్యాన అధికారిణి బెల్లం రాధిక చెట్టు నరికిన విద్యాసంస్థల నిర్వాహకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అంతటితో ఆగలేదు. రూ.25వేల జరిమానా విధించి తక్షణమే వసూలు చేశారు. జిల్లాకేంద్రంలోని గట్టయ్య సెంటర్‌లో జరిగిన ఈ సంఘటనతో స్థానికులు భారీగా అక్కడకు చేరుకున్నారు. దీంతో ఖమ్మం నగరంలో ఈ ఘటన బుధవారం చర్చనీయాంశంగా మారింది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

ఖమ్మం జిల్లాలో బుధవారం వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కరుణగిరి సమీపంలోని మున్నేరు బ్రిడ్జి వద్ద ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ముదిగొండ మండలం గోకినపల్లి వద్ద డివైడర్‌ను కారు ఢీకొట్టడంతో.. ఇద్దరు దుర్మరణం పాలయ్యారు.

- కరుణగిరి సమీపంలో ఆటో, బైక్ ఢీ
- ఇద్దరు అక్కడికక్కడే మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- గోకినపల్లి వద్ద డివైడర్‌ను ఢీకొట్టిన కారు
- ఇద్దరు దుర్మరణం

ఆటో, బైక్ ఢీకొని ఇద్దరు..

ఖమ్మం రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన ఖమ్మం రూరల్ మండలం కరుణగిరిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పట్టణంలోని దానవాయిగూడెం కాలనీకి చెందిన పల్లపు నరేష్ (28) ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. రోజూ మాదిరిగానే మంగళవారం కూడా కిరాయికి వెళ్లాడు. తెల్లవారుజామున దానవాయిగూడెం నుంచి నాయుడుపేట వైపునకు కిరాయికి వెళుతుండగా.. మార్గమధ్యలో కరుణగిరి సమీపంలోని మున్నేరు బ్రిడ్జి వద్ద ఎదురుగా వరంగల్ నుంచి ఖమ్మం వైపు బైక్‌పై వస్తున్న ఖమ్మం పట్టణంలోని బొక్కలగడ్డకు చెందిన రామ్ చరణ్‌సాయి (22) నరేష్ ఆటోను బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ నరేష్‌తో పాటు ద్విచక్రవాహనదారుడు రామ్ చరణ్‌సాయికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే బైక్‌పై ఉన్న మరో ఇద్దరు రాంబాబు, వీరబాబులకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుల కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


గోకినపల్లి వద్ద పల్టీ కొట్టిన కారు



పల్లపు నరేష్ రామ్ చరణ్
(ఫైల్ ఫొటోలు)

గోకినపల్లి వద్ద ఇద్దరి మృతి

ముదిగొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయరహదారిపై కారు డివైడర్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టిన ఘటనలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. ఈ సంఘటన ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం గోకినపల్లి వద్ద బుధవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఖమ్మంజిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామానికి చెందిన దొండేటి సాయిరంజిత్(33) తనకు పెదనాన్న వరుసయ్యే తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన కొండబాల శ్రీనివాస్(64)తో కలిసి బుధవారం సాయంత్రం కారులో నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం తాళ్లవీరప్పగూడెం గ్రామానికి వెళుతుండగా.. గోకినపల్లి వద్ద వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. అది ప ల్టీ కొట్టడంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఇరుక్కుపోయిన సాయిరంజిత్, శ్రీనివాస్ మృతదేహాలను హైవే పోలీసులు బయ టకు తీసి ముదిగొండ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఇద్దరి మృతితో ఇరు గ్రామాల్లో, బంధువుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు ముదిగొండ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మళ్లీ పెద్దపులి అలజడి!

భద్రాద్రి, ములుగు జిల్లాల సరిహద్దులో సంచరిస్తున్న టైగర్ భద్ర
భయాందోళనలో ప్రజలు

కరకగూడెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లా సరిహద్దులోకి పెద్దపులి వచ్చినట్లు అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. బుధవారం భద్రాద్రికొత్తగూడెం జిల్లా కరకగూడెం మండల సరిహద్దులోని ములుగు జిల్లా తాడ్వాయి మండలం లింగాల అడవుల్లో పెద్దపులి సంచరించినట్టు అక్కడి అటవీ శాఖ అధికారులు తెలిపారు. గతేడాది డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెలల్లో కరకగూడెం మండలంలోని గొల్లగూడెం నార్త్ బీట్ కంపార్టుమెంట్ -2 పంగల్‌వాగులో పెద్దపులి పాదముద్రలను కరకగూడెం మండల అటవీ శాఖ అధికారులు గుర్తించారు. గత సంవత్సరం ఛత్తీస్‌గడ్ రాష్ట్రం రత్నగిరి ప్రాంతం నుంచి వాజేడు, మల్లూరు అటవీ ప్రాంతం నుంచి ఇక్కడకు వచ్చినట్టు గుర్తించారు. మళ్లీ ఇప్పుడు భద్రాద్రి, ములుగు జిల్లాల సరిహద్దుల్లో పెద్దపులి సంచరిస్తోందన్న సమాచారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.


కరకగూడెం మండలంలో గతంలో సీసీ కెమెరాలో చిక్కిన టైగర్ భద్ర (ఫైల్ ఫొటో)

టైగర్ భద్రగా నామకరణం

గతేడాది డిసెంబరు నుంచి ఫిబ్రవరి వరకు కరకగూడెం మండలంలోని పంగల్‌వాగు, మసలమ్మ గుట్ట, చిరుమళ్ల, మోతె, నారాయణపేట అటవీ ప్రాంతాలలో సంచరించిన పెద్దపులి ఛత్తీస్‌గడ్ రాష్ట్రం నుంచి ఇక్కడకు వచ్చిన పెద్దపులి మగపులిగా గుర్తించారు. ప్రతీ సంవత్సరం ఇక్కడకు ఆడపులి జాడ కోసం బ్రీడ్(ఎద) కోసం ఇక్కడ వస్తుందని తెలిపిన అటవీ శాఖ అధికారులు ఆ పెద్దపులికి.. టైగర్ భద్రగా నామకరణం చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఏడూళ్ళ బయ్యారం రేంజర్ తేజస్వీ

జిల్లా సరిహద్దులోకి పెద్దపులి వచ్చినట్లు సమాచారం ఉందని గతంలో ఇక్కడ తిరిగిన ప్రాంతం కాబట్టి.. మళ్లీ రావొచ్చని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలకు సూచనలు ఇస్తున్నామన్నారు.


బంగారు ఆభరణాలను అందజేస్తున్న దృశ్యం

రామయ్యకు రూ.6 లక్షల బంగారు ఆభరణాల సమర్పణ

భద్రాచలం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి హైదరాబాద్‌లోని మూసాపేట్‌కు చెందిన డాక్టర్ ఏపీ కామేశ్వరరావు-అవసరాల విజయలక్ష్మి దంపతులు రూ.6 లక్షలు విలువైన బంగారు ఆభరణాలను సమర్పించారు. బుధవారం భద్రాద్రి రామయ్యను దర్శించిన వారుముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంబం వద్ద దేవస్థానం ఈవో ఎల్.రమాదేవికి లాంఛనంగా తాము తీసుకొచ్చిన బంగారు ఆభరణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పర్యవేక్షకులు కత్తి శ్రీనివాసరావు ఉన్నారు.

జిల్లాలో శాంతిభద్రతలు

క్షీణిస్తున్నాయి

● దొంగతనాలు, గంజాయి అమ్మకాలు పెరుగుతున్నాయి
● ఎమ్మెల్సీ తాతా మధుసూదన్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

ఖమ్మం,ఆగస్టు13(ఆంధ్రజ్యోతిప్రతినిధి) : జిల్లాలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని, దొంగతనాలు, గంజాయి విక్రయాలు పెరుగుతున్నాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఆరోపించారు. బుధవారం బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సత్తుపల్లి, ఖమ్మంపట్టణంలో దొంగలు స్వైరవిహారం చేస్తున్నారని, అపార్టుమెంట్లలోకి వచ్చి ఇళ్లల్లోకి వచ్చి దోచుకుంటున్నారని, సింగరేణిక్వార్టర్స్‌లో కూడా దొంగతనాలు జరుగుతన్నాయని ఆరోపిం చారు. ఖమ్మంలోని గోపాలపురంలో గంజాయి మత్తులో యువకులు అనేక ఘర్షణలకు దిగుతున్నారని,గోపాలపురంలో గంజాయి తాగి యువకుల ఆగడాలు పెరిగిపోతున్నాయన్నారు. జిల్లాలో గంజాయి వ్యాపారం కూడా అధికంగా జరుగుతుందని, పోకిరీలు చేష్టలు పెరుగుతున్నాయన్నారు. జిల్లాలో ఉన్న పోలీసు యంత్రాంగం ముగ్గురు మంత్రుల పర్యటనలు, బందోబస్తుకే పరిమితం అవుతున్నారని.. లాడ్జీలు, రెస్టారెంట్లు, హోటళ్లలో కూడా అకృత్యాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు.సెలవు దినాల్లో కూడా మంత్రులు పర్యటించడంతో పోలీసులు, అధికారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని,వారి కుటుంబాలతో కూడా ఉద్యోగులు, అధికారులు గడపలేకపోతున్నారన్నారు. ఇప్పటికైనా మంత్రులు జిల్లాలో శాంతి భద్రతల పరిస్థితిపైనా దృష్టి సారించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో డీసీసీబీ మాజీచైర్మన్‌కూరాకుల నాగభూషణం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు నాయకులు బెల్లం వేణు, ఉన్నం బ్రహ్మయ్య, మక్బుల్, ఖమర్, బొమ్మరరామ్మూర్తి, ఉప్పల వెంకటరమణ, బిచ్చాల తిరుమలరావు, పగడాల నరేందర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని

వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : అన్ని అర్హతలు ఉన్న తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని, ప్రభుత్వం వెంటనే స్పందించి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలంటూ అశ్వారావుపేట మండలంలోని ఉసిర్లగూడెం గ్రామానికి చెందిన గిరిజనుడు జెడ్డి మోహనరావు బుధవారం గ్రామ వాటర్ ట్యాంక్ పైకి ఎక్కి నిరసన తెలిపాడు. వివరాల్లోకి వెళితే.. మామిళ్లవారిగూడెం పంచాయతీలోని ఉసిర్లగూడెం గ్రామానికి చెందిన జెడ్డి మోహనరావు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. బార్య, ఇద్దరు పిల్లలతో తన మామ ఇచ్చిన పూరింట్లో నివాసం ఉంటున్నాడు. అందరిలాగే మోహనరావు కూడా ఇందిరమ్మ ఇంటిని దరఖాస్తు చేశాడు. అయితే పూరిగుడిసెలో ఉండే మోహనరావు ఎల్-3 కేటగిరీగా అధికారులు చేర్చారు. మొదటిదశలో ఎల్-1 కేటగిరిలో ఉన్న పేదలకు మాత్రమే ఇళ్ల మంజూరయ్యాయి. తనతో పాటు పేదలు ఇళ్లు కట్టుకుంటుంటే తనకు మాత్రం ఇళ్లు రాలేదని ఆవేదన చెంది బుధవారం మధ్యాహ్నం మామిళ్లవారిగూడెం పాఠశాల సమీపంలో గల వాటర్ ట్యాంక్ ఎక్కి ఆందోళన చేశాడు. ఘటనా స్థలి వద్దకు గ్రామస్తులు చేరుకుని సర్దిచెప్పినా వినలేదు. ఏం జరుగుతుందోనంటూ గ్రామస్తులు ఆందోళన చెందారు. అనంతరం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మోహనరావుకు తెలియకుండా పైకి ఎక్కి ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా చూస్తామని తెలపడంతో.. అతను ఎట్టకేలకు కిందికి దిగాడు.



మున్నేరు వరదల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిగా వేణుగోపాల్

ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మున్నేరుకు వరదల సందర్భంగా ప్రత్యేక అధికారిగా వేణుగోపాల్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియామకం చేసింది. ఖమ్మం మునిసిపల్ కార్యాలయానికి గతంలో కమిషనర్‌గా చేసిన అనుభవం వేణుగోపాల్‌కు ఉంది. కాగా వరదలపై కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య కార్యాలయంలో ఆయా ప్రాంతాల వార్డు ఆఫీసర్లతో సమావేశం నిర్వహించి అప్రమత్తం చేశారు. ముంపు ప్రాంతాల్లో సహాయ చర్యలకు సహకరించే ఆపదమిత్రాలకు టార్చ్‌లైట్, రెయిన్ కోట్, ఇతర వస్తువులు అందిస్తామన్నారు. అనంతరం పోలీసు కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి మున్నేరు వరదలను పరిశీలించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

» కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్

తిరుమలాయపాలెం, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): భారీవర్షాలతో ఎటువంటి నష్టం జరగకుండా అధికారయంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బుధవారం మండలంలోని రాకాసితండా వద్ద సీతారామ ప్రాజెక్టు కాలవ నీరు ప్రహించే ఏర్పాటుచేసిన వంతెన పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాకాసితండా వద్ద ఆకేరు కు అడ్డంగాఉన్న రాళ్లను తొలిగించాలని సూచించారు. జిల్లాలో భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వివిధ శాఖల అధికారులు సెలవులుపెట్టవద్దని ఆదేశించారు. గతేడాది సెప్టెంబరులో భారీవర్షంతో ఆకేరు నది పొంగడంతో రాకాసితండా వాసులకు తీరనినష్టం జరిగిందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తొలుత రాకాసితండాను రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ సతీష్ పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ జగదీష్, ఎంపీడీవోసిలార్‌సాహెబ్, తహీల్దార్ లూథర్ విల్సన్,డీఈ రమేష్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఖమ్మంక్రైం: భారీవర్షాలు కురుస్తాయని హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, వాగులు వంకలు దాటే ప్రయత్నంచేయవద్దని పోలీసుకమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. నగరంలోని కాల్వొడ్డు, మున్నేరు, ప్రకాష్‌నగర్ మున్నేనరు ప్రాంతాలను మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ అత్యవసర సమాయాల్లో డయల్100కు లేదా పోలీసుకంట్రోల్‌రూం 8712659111కు లేదా కలెక్టర్ ఆఫీస్ టోల్‌ఫ్రీనెంబరు 1077, 9063211298 కు సమాచారం అందించాలన్నారు. ఈకార్యక్రమంలో టౌన్ ఏసీపీ రమణమూర్తి, సీఐలు మోహన్‌బాబు, రమేష్, పాల్గొన్నారు.



బాల సముద్రం సమీపంలో నీట మునిగిన వరి పొలాలు



మున్నేరువద్ద అధికారులతో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్



రాకాసితండా వద్ద ఆకేరు నదిని పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

మునిగిన వరి పొలాలు...

నేలకొండపల్లి, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తోడు పైనుంచి వస్తున్న వరద తాకిడికి మండలంలోని వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. చెరువులు అలుగులు పోస్తున్నాయి. వరదలు రావడంతో వేసిన వరి నాట్లు కొట్టుకునిపోయాయి. బాలసముద్రం చెరువు మత్తడి పోస్తుండటంతో పాటుగా పక్కనే ఉన్న మోర్లబండ వాగుకు వరద తాకిడి పెరగటంతో వందల ఎకరాల్లో వరి పంటలు మునిగి పోయాయి. చెరువుమాధారం చెరువు సైతం పూర్తిస్థాయిలో నిండి అలుగు పోస్తున్నది. ప్రజలు చేపల వేట కోసం వాగుల వద్ద గుమిగూడటం అన్ని చోట్ల కనిపిస్తున్నది.

తిరుమలాయపాలెం: మండలంలోని వివిధ గ్రామాల్లో గత రెండురోజులుగా భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో చెరువులు, వాగులు, వంకలు పొంగాయి. ఆకేరు నది ఉధృతంగా ప్రవహిస్తుంది. బంధంపల్లి-బీరోలు,మేడిదపల్లి-సుబ్లేడు, బచ్చోడు-హస్నాబాద్ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డాయి. వరద ఉధృతిని ఎస్ఐ జగదీష్, ఎంపీడీవో సిలార్‌సాహెబ్ తహసీల్దార్ లూథర్ విల్సన్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు రామసహాయం నరేష్‌రెడ్డి పరిశీలించారు.

న్యాయం చేయాలని వినతి

ఖమ్మంబైపాస్‌రోడ్ ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): నగరంలోని మున్నేరు పరివాహక ప్రాంతంలో జరుగుతున్న రిటైనింగ్ వాల్ నిర్మాణం కారణంగా భూములు, ఇళ్లు, ప్లాట్లు కోల్పోయామని, తమకు న్యాయం చేయాలని నిర్వాసితులు ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. జిల్లాపర్యటనలో భాగంగా ఖమ్మం వచ్చిన ఆయనను పలువురు నిర్వాసితులు కలిసి మాట్లాడారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, సన్నే ఉదయ్‌ప్రతాప్, గల్లా సత్యనారాయణ, నున్నా రవికుమార్, రవిరాథోడ్, మందడపు సుబ్బారావు, మంద సరస్వతి పాల్గొన్నారు.

హెచ్‌ఐఈఈతో యస్‌బీఐటీ ఒప్పందం



హెచ్‌ఐఈఈ తో ఒప్పంద పత్రాలు తీసుకుంటున్న కృష్ణ

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఎలక్ట్రికల్ సంస్థ హైదరాబాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ (హెచ్‌ఐఈఈ)తో ఎస్బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల ఈఈఈ, ఈసీఈ విభాగాలు బుధవారం కళాశాలలో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయని యస్‌బీఐటీ కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. హెచ్‌ఐఈఈ కంపెనీ నైపుణ్యాభివృద్ధిలో భాగంగా విద్యార్థులకు ప్రాక్టికల్ ఆధారిత సదస్సులు, పరిశ్రమల సందర్శన, ప్లేస్మెంట్స్, రియల్ టైమ్ ప్రాజెక్టు, ఎలక్ట్రికల్ ఎంఎస్సీ సంస్థలలో ఉద్యోగాలకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. ధాత్రి తెలిపారు. హెచ్‌ఐఈఈ కంపెనీతో తమ కళాశాల ఒప్పదం కుదుర్చుకోవడం హర్షనీయమని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రాజ్‌కుమార్ అన్నారు. ఈ ఒప్పందం మూడేళ్ల పాటు అమలులో ఉంటుందని ఈసీఈ విభాగపు అధిపతి కె. అమిత్భందాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఐఈఈ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కె. మదన్‌మోహన్, కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ. శివ ప్రసాద్, రవీంద్రబాబు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల ఆహ్వానం మేరకే
పాలస్తీనా ర్యాలీలో పాల్గొన్నాం

» ప్రైవేట్ విద్యా సంస్థల వివరణ

ఖమ్మంఖానాపురంహవులి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మా ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థులకు శిక్షణ సమగ్రాభివృద్ధికి మాత్రమే, ఏ రాజకీయ, మత, లేదా పక్షపాత కార్యక్రమాల్లో పాల్గొనడం కాదని విద్యా సంస్థల అధిపతులు మువ్వా శ్రీనివాసరావు, ఐవీ. రమణారావు, రవిమారుత్, ముదిరెడ్డి వీరారెడ్డి, గుర్రం కాంతారావులు బుధవారం తెలిపారు. దురదృష్టవశాత్తూ, కొన్ని రాజకీయ సంఘాలు ఈ ర్యాలీలో పాల్గొనడానికి నిర్దిష్ట రాజకీయ లేదా అంతర్జాతీయ అజెండాకు మద్దతుగా లేదా ప్రతిఘటనగా పొరపాటుగా భావించడం వల్ల ఆ విషయంపై స్పష్టత ఇస్తున్నాం అన్నారు. ఈ విషయంలో మాకు ఎటువంటి రాజకీయ అనుబంధం లేదన్నారు. మేము శాంతి, ఐక్యత, అన్ని సమాజాల పట్ల గౌరవం వంటి సూత్రాలను ఎంతో విలువైనదిగా భావిస్తామని తెలిపారు.

విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని వెలుగుమట్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు హోల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఇంగ్లీష్ డిక్షనరీలను బుధవారం పంపిణీ చేశారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులందరూ తప్పనిసరిగా ఆంగ్లభాష పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, అందుకు అంగ్ల డిక్షనరీలతో పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని యలమద్ది వెంకటేశ్వర్లు అన్నారు. ఈ కార్యక్రమంలో హోల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్న కృష్ణయ్యకు పలువురి నివాళి

ఖమ్మంచర్చికాంపౌండ్, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగరంలోని కొత్తగూడేనికి చెందిన మున్నూరుకాపు సంఘం నాయకులు బొమ్మిశెట్టి శ్రీనివాస్ తండ్రి బొమ్మిశెట్టి చిన్న కృష్ణయ్య మృతిచెందారు. ఈవిషయం తెలుసుకున్న మున్నూరుకాపు సంఘం సీనియర్ నాయకులు గుండాల కృష్ణ ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం నాయకులు జీవీవీఎల్. నరసింహారావు, కోనేటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

ఏన్కూరు, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని వైరా ఏడీఏ కొంగర వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం మండలంలోని జన్నారం, తూతక్కలింగన్నపేట, ఏన్కూరు తదితర గ్రామాల్లో ఎరువుల దుకాణాలు, గోడౌన్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో నరసింహారావు పాల్గొన్నారు.

కాకతీయ మ్యారేజ్ బ్యూరో బ్రాంచ్ ప్రారంభం



మ్యారేజ్ బ్యూరో బ్రాంచ్ ను ప్రారంభిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని గట్టయ్య సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కాకతీయ మ్యారేజ్ బ్యూరో సెంటర్‌ను బుధవారం ఖమ్మం నగర పాలక సంస్థ మేయర్ పూనుకొల్లు నీరజ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... కాకతీయ మ్యారేజ్ బ్యూరో నిర్వాహకులు గతంలోనే ఎన్నో బ్రాంచ్‌లు ఏర్పాటు చేసుకుని, నేడు మరో బ్రాంచ్‌ను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. నూతన బ్రాంచ్ సందర్భంగా అన్ని వర్గాల వారికి ఎలాంటి ఫీజు లేకుం డా ఈనెల 13,14,15 తేదీలలో ఉచితంగా రిజిస్ట్రేషన్‌ను కాకతీయ మ్యా రేజ్ బ్యూరో కల్పిస్తుందని సంస్థ వ్యవస్థాపకులు యలమంచిలి చిరంజీవి రావు, డైరెక్టర్లు రమాదేవి, నవీన, శివలు తెలిపారు. ఉచిత రిజిస్ట్రేషన్ అవకాశాన్ని ఖమ్మం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేయాలి

» రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న రాయల నాగేశ్వరరావు

నేలకొండపల్లి, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భేషజాలు వదిలి కలిసికట్టుగా ముందుకు సాగాలని తద్వారా రానున్న స్థానిక ఎన్నికల్లో నూరు శాతం విజయాలు నమోదు చేసి మంత్రి పొంగులేటికి కానుకగా ఇవ్వాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం నేలకొండపల్లిలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఆర్థికంగా మిగులులో ఉన్న తెలంగాణా రాష్ట్రాన్ని పదేళ్ళు పాలించిన బీఆర్ఎస్ అప్పుల కుప్పగా మార్చిందన్నారు. మంత్రి సహాయ నిధి చెక్కులను 68మంది లబ్దిదారులకు అందచేశారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, దయాకర్‌రెడ్డిలు సమావేశంలో మాట్లాడా రు. కొడాలి గోవిందరావు, నెల్లూరి భద్రయ్య, బొడ్డు బొం దయ్య, ఆరెకట్ల గురునాధం, వేగినాటి లక్ష్మీనర్సయ్య, వెన్నపూసల సీతారాములు, షేక్.ఖాజా మియా, గుడిమళ్ళ మధు, శాఖమూరి రమేష్, కట్టెకోల నాగార్జున, రాయపూడి నవీన్, యడవల్లి సైదులు, యడవల్లి నాగరాజు, అనంతు కాశయ్య, జొన్నటగడ్డ రవికుమార్, ఎస్‌కే. సోందు, ఈవూరి శ్రీనివాసరెడ్డి, నంబూరి రామారావు, తేజావత్ శివాజి, పాల్గొన్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

కూసుమంచి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. పాలేరులో, మల్లాయిగూడెంలో పీఆర్ రోడ్లకు శంకుస్థాపన చేస్తారు. నేలకొండపల్లి మండలం బోదులబండ జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తారు. నేలకొండపల్లిలో పశువైద్యశాల నిర్మాణ పనులను ప్రారంభిస్తారు. భైరవునిపల్లిలోనూ, బాణాపురంలో, ఏదులాపురం మున్సిపాలిటీలో ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొంటారు. రెడ్డిపల్లి, సత్యనారయణపురం ఖమ్మం-సప్తపది ఫంక్షన్‌హాల్‌నందు, తల్లాడలోనూ, రాత్రి 7గంటలకు సత్తుపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారు.

పోలీసుల తనిఖీలు

ఖమ్మంక్రైం, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగనరంలోని హోటల్స్, లాడ్జీలు, రైల్వేస్టేషన్, బస్టాండ్లలో ఖమ్మం పోలీసులు సోదాలునిర్వహించి అనుమానితుల నుంచి వివరాలు సేకరించినట్లు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 50 హోటళ్లు, లాడ్జిలపై ఈసోదాలు నిర్వహించామని తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు హెచ్‌ఐవీపై శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బి. కళావతి బాయి మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లందరూ హెచ్‌ఐవీ గురించి పూర్తిగా తెలుసుకుని అది వ్యాప్తి చెందే మార్గాలను జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. హెచ్‌ఐవీ నిరోధించడంలో ప్రధాన భూమిక వహించాలన్నారు. హెచ్‌ఐవీ సోకినవారు మందులు వాడడం ద్వారా తమ జీవితకాలాన్ని పొడగించుకోవచ్చన్నారు. హెచ్‌ఐవీపాజిటివ్ వ్యక్తులను ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి. వెంకటరమణ, జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ చందు నాయక్, డాక్టర్ బిందు శ్రీ, డాక్టర్ పి రామారావు, ఏఆర్టీ డాక్టర్ లక్ష్మణరావు, డెమో సుబ్రహ్మణ్యం, అన్వర్, దుర్గా, జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ యూనిట్ మహమూద్ అలీ, లింక్ వర్కర్స్ స్కీం వి. శివయ్య, డీఎస్ఆర్సీ కౌన్సిలర్ కొండల్, జాగృతి స్వచ్ఛంద సేవా సంస్థ హలీం, సోహెల్ తదితరులున్నారు.

ఎంఈవోల నియామకం

ఖమ్మంఖానాపురంహవులి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో రెండు మండలాలకు కొత్తగా ఇద్దరు ఎంఈవోలను నియమిస్తూ విద్యాశాఖ డైరెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. కూసుమంచి ఎంఈవోగా కూసుమంచి మండలం జడ్పీహెచ్ఎస్ నేలపట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీవీ. రామాచారిని, ఏన్కూర్‌కు ఏన్కూర్ మండలం జడ్పీహెచ్ఎస్ జన్నారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. మన్‌మోహన్‌రెడ్డిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. గతంలో ఎంఈవోలుగా పని చేసిన ఇరు మండలాల్లోని ఎంఈవోలు జూనియర్లు కావడంతో, ఆయా మండలాలలోని సీనియర్లను ఎంఈవోలుగా నియమిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

20నుంచి మేడ్చల్‌లో సీపీఐ రాష్ట్ర మహాసభలు

» ఆపార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం



మాట్లాడుతున్న బాగం హేమంతరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మహాసభలు ఈనెల 20 నుంచి 22 వరకు మేడ్చల్‌లో జరుగుతాయని 13 జిల్లాల నుంచి 700 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. సభలకు జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా, జాతీయ కార్యదర్శి కే నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, చాడా వెంకటరెడ్డి పాల్గొంటారని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. బుధవారం గిరిప్రసాద్ భవన్‌లో యర్రా బాబు అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర మహాసభలో గత కార్యక్రమాలను సమీక్షించి భవిష్యత్ కార్యచరణ రూపొందించటం జరుగుతుందని వివరించారు. ఖమ్మం నగరం గతంలో ఆదర్శంగా ఉండేదని ఇప్పుడు యువత గాడి తప్పిందన్నారు. అధికార యంత్రాంగం బాధ్యతగా వ్యవహరించి మత్తు పదార్థాలను పూర్తిగా కంట్రోల్ చేయాలని కోరారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. విపక్షాలపై సీబీఐ, ఈడీ కేసులు నమోదు చేసిన బీజేపీ పార్టీ ఎన్నికల సంఘాన్ని దుర్వినియోగం చేస్తుందన్నారు. 2020, 2024 లో పలు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దొంగ ఓట్లుకు బీజేపీ పాల్పడిందని ఆరోపించారు. కార్పొరేట్ శక్తులకు అండగా మోదీ ఉంటున్నారని విమర్శించారు. నాయకులు మహ్మద్ మౌలానా, దండి సురేశ్, జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య స్ఫూర్తితో ముందుకు సాగాలి



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మొహ్మద్‌జాకిరుల్లా

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య పోరాటం ముందు తరాలకు మార్గదర్శనం, స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా అన్నారు. బుధవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ఐక్యూఏసీ -చరిత్ర విభాగాల సంయుక్తంగా ఉమ్మడి జిల్లా స్థాయి డిగ్రీ విద్యార్థులకు భారత స్వాతంత్ర్యోద్యమం-ప్రపంచానికి ఆదర్శం అనే అంశంపై నిర్వహించిన పోటీలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉమ్మడి జిల్లాల నుంచి 54మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.బానోత్ రెడ్డి, ఐక్యూ.ఏ.సీ కోఆర్డినేటర్ డా.ఎం.సునంద, చరిత్ర విభాగం ఇన్‌చార్జ్ డా.వేణుమాధవ్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్ శాఖాధిపతులు, డా.ధనమూర్తి,పి.నరసింహారావు, డా.లక్ష్మణరావు, వై.రవివర్ధన్, అధ్యాపకులు అజిత్, నాగలక్ష్మి, శ్రీనివాస్, వీరన్న పాల్గొన్నారు.

రేణుకాచౌదరి జన్మదిన వేడుకలు



కాంగ్రెస్ నాయకులతో పోస్‌లో మాట్లాడుతున్న రేణుకాచౌదరి

రఘునాథపాలెం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి జన్మదిన వేడుకలను ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రఘునాథపాలెంలోని మదర్‌థెరిస్సా అనాథ శరణాలయంలో పండ్లు, ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో పోస్‌లో రేణుకాచౌదరి మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలని కోరారు. మండల కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్ తదితరులున్నారు.

రిటైల్ కూరగాయల మార్కెట్ వ్యాపారస్తుల కమిటీ ఎన్నిక

ఖమ్మం మార్కెట్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన కూరగాయల మార్కెట్‌లోని రిటైల్ వ్యాపారస్తుల సంఘం ఎన్నికలు బుధవారం జరిగాయి. ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా కర్నాటి సాయి, ఉపాధ్యక్షుడిగా నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా నాలం గోపికృష్ణ, జాయింట్ సెక్రటరీగా చెరుకూరి నాగమణి, కోశాధికారిగా పసుపులేటి రామారావులు ఎన్నికయ్యారు. ఎన్నికల్లో మొత్తం 294 మంది రిటైల్ వ్యాపారులు పాల్గొన్నారు. కర్నాటి సాయి ప్యానల్ 105 ఓట్ల తేడాతో విజయం సాధించారు.

జిల్లా పశు వైద్యుల సంఘం అధ్యక్షుడిగా హరీష్



ఖమ్మం రూరల్ /ఖమ్మం స్పోర్ట్స్ ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా పశు వైద్యుల సంఘం అధ్యక్షుడిగా అనంతు హరీష్ ఎన్నికైనారు. బుధవారం నగరంలో జరిగిన ఆ సంఘ జనరల్ బాడీ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా హరీష్‌ను ఎన్నుకోవడం ఇది వరుసగా మూడో సారి కావడం విశేషం. అంతేకాకుండా సంఘ సెక్రటరీగా మానుకొండ రాకేష్‌కుమార్, కోశాధికారిగా రఘుపతి, ఈసీ మెంబర్లుగా ఉషశ్రీ, శశిదీప్, జానీ, క్రిష్ణారెడ్డి, సృజనలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో పశు వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌బాబు, మాజీ అధ్యక్షుడు ఉపేందర్ తదితరులున్నారు.

ఖమ్మం జిల్లాకు చేరుకున్న రెజాంగ్ల రజ్ కలశయాత్ర

కూసుమంచి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో చేపట్టిన రెజాంగ్ల రజ్ కలశ యాత్ర సూర్యాపేట జిల్లా నుంచి ఖమ్మం జిల్లాలోకి చేరుకుంది. ఈసందర్భంగా ఖమ్మం జిల్లాకు చెందిన యాదవ మహాసభ నాయకులు స్వాగతం పలికారు. 1962 ప్రాంతంలో రెజాంగ్ల అనే ప్రాంతంలో ఇండియా-చైనాల మధ్య జరిగిన యుద్ధంలో 120 మంది యాదవ యుద్ధవీరులు వీరమరణం పొందినందుకు గుర్తింపుగా యాదవ రెజిమెంట్ ప్రకటించాలని రాష్ట్రవ్యాప్తంగా ఈ యాత్ర చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు మేకల మల్లిబాబుయాదవ్, జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటనర్సయ్య, చిత్తారు సింహాద్రి, లోడంగి గోవర్ధన్, దాసరి వెంకన్న, బారి నగేష్, చెన్ను వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని ఫిర్యాదు

కామేపల్లి, ఆగస్ట్ 13(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నానికి సుపారీ ఇచ్చిన వ్యక్తి నుంచి రక్షణ కల్పించాలని మద్దులపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సామా మోహన్‌రెడ్డి బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనతో పాటు, నూకల ఉపేందర్‌ను హత్య చేయించేందుకు మాగ్రామానికి చెందిన యువకుడు గడబోయిన హరీష్ మహబూబాబాద్‌కు చెందిన ఓ గ్యాంగ్‌తో రూ.4లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడని, రూ. లక్ష ముందస్తుగా ఇచ్చాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అతని నుంచి ప్రాణరక్షణ కల్పించాలని కోరారు. ఈ విషయంపై ఖమ్మం సీపీ, ఏసీపీ, సీఐలను కలిసినట్లు తెలిపారు. ఆయన వెంట అంతోటి అచ్చయ్య, మల్లెంపాటి శ్రీనివాసరావు, వడియాల క్రిష్ణరెడ్డి, కాట్రాల రాంబాబు, పుచ్చకాయల బాబు, చిదంబరం ఉన్నారు.

గొలుసు డొంక ఆక్రమణపై ....

కామేపల్లి, ఆగస్ట్ 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మద్దులపల్లి ఏజెన్సీ గ్రామంలో గొలుసు డొంకను కొంతమంది రైతులు ఆక్రమించారని ఎస్సీ ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాలె శ్రీను, వెంకటేశ్వర్లు, జె. వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లో కమిషన్ కార్యాలయంలో కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ డొంక 60యేళ్ల చరిత్ర కలిగిన రహదారి అని, ఆక్రమణకు గురికావడంతో మిగిలిన రైతులు వారి పంట చేలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. ఈసందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హమీ ఇచ్చినట్లు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

కూసుమంచి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని హట్యతండాలో గుగులోతు తిమ్మి కుమార్తె భానుప్రియ వివాహానికి పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి చేయూత అందించారు. ఈమేరకు రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు. తిమ్మి ఇటీవల అనారోగ్యానికి గురయింది. ఇదేసమయంలో తన కుమార్తె భానుప్రియ వివాహం నిశ్చయం అయింది. మండల పార్టీనాయకులు కందాళ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి తనవంతు ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో వేముల వీరయ్య, ఆసీఫ్‌పాషా, మల్లిడి వెంకన్న, కిషన్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు..

దగ్గుపాటిని పరామర్శించిన మంత్రి తుమ్మల

వైరా, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ నాయకుడు దగ్గుపాటి సత్యనారాయణను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. ఆయన ఆరోగ్య యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యం చేకూరాలని ఆకాంక్షించారు. డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వర్‌రెడ్డి, వైరా మండల నాయకుడు శ్రీరామనేని విజయభాస్కర్ తుమ్మల వెంట ఉన్నారు.



దగ్గుపాటిని పరామర్శిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌లో ప్రైవేట్ పార్కింగ్!

పట్టణంలో ఓ రాజకీయ నాయకుడి హామీతో ఏర్పాటు

రెవెన్యూ గెస్ట్‌హౌస్‌ను పార్కింగ్ స్టాండ్ గా మార్పు

మధిర, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): అత్త సొమ్ము అల్లుడు దానం అన్నట్లు మధిర పట్టణంలో ఉన్న రెవెన్యూ గెస్ట్‌హౌస్‌ను ఏకంగా అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ ముఖ్య పట్టణ నాయకుడు ఓ వ్యక్తికి ప్రభుత్వ ఆస్తిని అల్లుడిలా దారాదత్తం చేసిన వైనం మధిరలో జరిగింది. స్థానిక ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్‌కు మధ్యలో దాదాపు 50 ఏళ్ల క్రితం రెవెన్యూ గెస్ట్‌హౌస్‌ను ప్రభుత్వం నిర్మించింది. స్థానికంగా ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్ కట్టకు ముందే రెవెన్యూ గెస్ట్‌హౌజ్ నిర్మించడంతో మధిరకు ఎవరైనా అధికారులు వస్తే ఇందులోనే కాసేపు సేద తీరే వారు. కలెక్టర్, ఆర్డీవో, రెవెన్యూ ఉన్నతాధికారులు ఎవరు వచ్చినా వారికి వసతిని ఇక్కడే ఏర్పాటు చేసేవారు. ఎన్నికల తరువాత వచ్చిన తహసీల్దార్లు ఎవరూ దీన్ని వాడకపోవడంతో ఖాళీగాఉంది. దీనితో మధిరకు చెందిన రంగస్థల కళాకారులు స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి రెవెన్యూ గెస్ట్‌హౌస్ నిరుపయోగంగా ఉంటుందని దాన్ని కళాకారుల సాధన కోసం తాత్కాలింగా వాడుక నేందుకు ఇవ్వాలని వినతిపత్రం ఇచ్చారు. దీంతో డిప్యూటీ సీఎం భట్టి తహసీల్దార్‌ను పిలిచి పరిస్థితిని అడుగగా.. ప్రస్తుతం గెస్ట్‌హౌస్‌ని వాడటం లేద ని తెలపడంతో ఆ భవనాన్ని కళాకారులకు ఇవ్వాలని ఆదేశించారు. దీనితో స్థానిక కళాకారులు ఆ భవనాన్ని స్వాధీనం చేసుకుని మధిర నియోజకవర్గ సాంస్కృతిక కళాకేంద్రంగా పేరు పెట్టుకున్నారు. కానీ వారుకూడా ప్రస్తుతం వాడ కుండా తాళం వేసి ఉంచారు. మధిరలో నూతన బస్టాండ్‌ను నిర్మిస్తుండంతో బస్టాండ్ ప్రాంతంలో ఉన్న పార్కింగ్‌ను ఖాళీ చేసి వేరే చోట పెట్టుకోమని కాంట్రాక్టర్‌కు ఆర్టీసీ అధికారులు తెలిపారు. సదరు కాంట్రాక్టర్ బస్టాండ్‌లో ఉన్న పార్కింగ్‌ను రెవెన్యూ గెస్ట్‌హౌస్‌కు తరలించాడు. ఇదేమని సదరు కాంట్రాక్టర్‌ను ఆంధ్రజ్యోతి అడగగా తాను పట్టణ కాంగ్రెస్ ముఖ్య నాయకుడిని అడిగే పెట్టుకున్నట్లు తెలిపాడు. కానీ, దాదాపు మూడు కోట్ల విలువైన ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నం జరుగుతున్నట్లు తెలుస్తుంది. గతంలో కూడా మధిర నడిబొడ్డున ఉన్న ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ స్థలాన్ని ఓ వ్యక్తి నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకుని ఆ శాఖ అధికారులనే ఖాళీ చేయమని లీగల్ నోటీస్ ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చి అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్ సస్పెండ్ అయ్యాడు. స్థానిక హిందూ శ్మశానవాటిక స్థలం కూడా ఇదేవిధంగ అక్రమ రిజిస్ట్రేషన్ చేయించు కున్నా చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారు. ఈ మేరకు రెవెన్యూ గెస్ట్‌హౌస్ కూడా కబ్జాకావడం ఖాయమని ప్రజలు చర్చిం చుకుంటు న్నారు. దీనిపై స్థానిక తహసీల్దార్ రాంబాబును వివరణ కోరగా కళాకారులు తాత్కాలి కంగా వాడుకునేందుకు ఖాళీగా ఉన్న భవనాన్ని ఇచ్చామన్నారు. ఇది వ్యాపారం చేసుకోవటానికి కాదు అని దీనిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



గెస్ట్‌హౌస్‌లో పార్కు చేసిన ద్విచక్ర వాహనాలు



రెవెన్యూ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కళాకేంద్రం

భారత సనాతన ధర్మాన్ని ప్రపంచం ఆచరించేందుకు సిద్ధం

సత్తుపల్లిలో 160 అడుగుల భారీ జాతీయ జెండా ప్రదర్శన

బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు

సత్తుపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భారత సనాతన ధర్మాన్ని ప్రపంచం ఆచరించేం దుకు సిద్ధంగా ఉందని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. ప్రధాని మోదీ పిలుపుమేరకు బుధవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ సందర్భంగా సత్తుపల్లిలో వేలాది మంది పాఠశాల, కళాశాల విద్యార్థులతో కలిసి బీజేపీ ఆధ్వర్యంలో 160అడుగుల భారీ జాతీయ జెండా ప్రదర్శనతో ర్యాలీ తీశారు. అనంతరం రింగ్‌సెంటర్ వద్ద నంబూరి మాట్లాడుతూ యావత్ ప్రపంచం భారత్ వైపు చూస్తుందని, అతిత్వరలో ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన అఖండ భారతాన్ని చూడబోతున్నామన్నారు. ప్రతిఒక్కరూ ఈ జాతీయ జెండాను చేతబూని అద్భుతమైన అనుభూతితో ఈ స్వాతంత్ర్య దినోత్సవాన్ని గొప్పగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. దేశ సమైక్యతను, దేశ సమగ్రతకు యువత బాటలు వేస్తూ దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని, భారత దేశం అంటే సబ్ కా సాత్, సబ్ కా విశ్వాస్, సబ్ కా విశ్వాస్ అని చాటిచెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాయుడు రాఘవరావు, సుదర్శన్ మిశ్రా, పడిగల మధుసూదన్‌రావు, వీరంరాజు, ప్రసాద్, విజయ్, శివకృష్ణ, పాలకొల్లు శ్రీనివాస్, నాగస్వామి, శివ, లక్ష్మీనారాయణ, సుబ్రహ్మణ్యం, శివ, ప్రభాకర్‌రెడ్డి, రాంబాబు, కృష్ణయ్య, వసంతరావు, అశోక్, ప్రసాద్, సుబానీ, శేషగిరి, శ్రీనాథ్, సుధాకర్ పాల్గొన్నారు.



సత్తుపల్లిలో 160 అడుగుల జెండాతో విద్యార్థుల ప్రదర్శన

ఘనంగా సన్నాహక జన్మాష్టమి వేడుకలు

తల్లాడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలభారతి విద్యాలయంలో బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి సన్నాహక వేడకలు ఘనంగా జరిగాయి. సంస్కృతి, సాంప్రదాయల పరిరక్షణలో భాగంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో కనువిందు చేశారు. చిన్నారులు ఉట్టికొట్టడం, నృత్యరూపాలు అలరించాయి.



జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

జిల్లా రైతులకు యూరియా వెతలు

బొంతు రాంబాబు

వైరా, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముగ్గురు రాష్ట్ర మంత్రులున్నా రైతులకు అవసరమైన యూరియా సరఫరా చేయడంలో విఫలమయ్యారని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు విమర్శించారు. రైతులు గంటలకొద్దీ ఎదురుచూపులు, కిలోమీటర్ల మేర క్యూలైన్లలో నిలబడలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వైరాలో రైతులు యూరియా కోసం తెల్లవారుజాము నుంచి పది గంటల వరకు పడిగాపులు కాసినా యూరియా లారీ రాకపోవడంతో రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ రైతులకు మద్దతుగా రాంబాబు సొసైటీ అధికారులను, సిబ్బందిని నిలదీశారు. 200 యూరియా బస్తాలు మాత్రమే వస్తున్నాయని చెప్పడంతో 400 మందికిపైగా ఉన్న రైతులు ఆందోళన చేస్తూ రోడ్డు మీదకు వచ్చారు. ఆసమయంలో సొసైటీ చైర్మన్ అయిన రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల వ్యవసాయశాఖ అధికారి మయాన్ మంజూఖాన్ స్పందించి గురువారం నాటికి మరో లారీలోడ్ యూరియా అందిస్తామని హామీ ఇచ్చి రైతులను శాంతింపజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో వరి, సాగర్ ఆయకట్టు పరిధిలో పత్తి ప్రధాన పంటలుగా ఉండటం వలన యూరియా వినియోగం ఎక్కువగా ఉందని, ఈ మేరకు సకాలంలో యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతులు హరి, వెంకటేశ్వరరావు, కామినేని రవి, రాచబంటి నాగరాజు, మాడపాటి మల్లికార్జున్, వడ్లమూడి మధు పాల్గొన్నారు.



సొసైటీ అధికారులను ప్రశ్నిస్తున్న బొంతు రాంబాబు

ఆర్టీసీ ఉద్యోగులకు మిఠాయిల పంపిణీ



మిఠాయిలు పంపిణీ చేస్తున్న డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి

సత్తుపల్లిరూరల్, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): రాఖీపౌర్ణమి సందర్భంగా ఈనెల 7, 8, 9, 10, 11తేదీ వరకు సత్తుపల్లి డిపో గణనీయమైన ఆదాయం సాధించిన సందర్భంగా ఉద్యోగులకు సత్తుపల్లి డిపో మేనేజర్ యు. రాజ్యలక్ష్మీ బుధవారం మిఠాయిలను పంపిణీ చేశారు.సత్తుపల్లి డిపోకు 7తేదీన రూ.25.60 లక్షలు, 8న 26.33 లక్షలు, 9న 35.45 లక్షలు, 10న 26.75లక్షలు, 11న 32.70లక్షల చొప్పున మొత్తం రూ.1.46కోట్ల ఆదాయం సాధించిందని ఆమె తెలిపారు. 96శాతం ఓఆర్‌తో పాటు ఈపీకే 64.98 సాధించిందని తెలిపారు. ఇందుకు కృషి చేసిన డ్రైవర్, కండక్టర్లు, సూపర్‌వైజర్లను అభినందించించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ వీ.విజయశ్రీ, ఎంఎఫ్ సిలివేరు సాహితీ, వీటీఓ కిన్నెర ఆనందరావు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విపత్తు పట్ల కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి

కల్లూరు, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి) విపత్తుల సమయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో రానున్న మూడు రోజుల పాటు గ్రామాల్లో ఎలాంటి సంఘటన సంభవించిన కార్యదర్శిలు 1017 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని కోరారు. వరద ముంపు ప్రాంతాల్లో ఎక్కడైన గృహాలు నీట మునిగే అవకాశాలు ఉంటే ముందు గా గుర్తించి బాధిత కుంటుబాల వారిని ఆవాస ప్రాంతాలకు తరలించాలన్నారు. ఇలాంటి సమయంలో కార్యదర్శిలు తమ గ్రామ పంచాయతీల్లో అందుబాటులో ఉంటూ ఆశా, అంగన్‌వాడీలను సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వర్తించాలని ఎంపీడీవో పేర్కొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

ఏన్కూరు, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని వైరా ఏడీఏ కొంగర వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం మండలంలోని జన్నారం, తూతక్కలింగన్నపేట, ఏన్కూరు తదితర గ్రామాల్లో ఎరువుల దుకాణాలు, గోడౌన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక రసాయనిక ఎరువుల వాడకంతో భూసారం క్షీణించడంతో పాటు మానవాళి ఆరోగ్యానికి హాని కలిగిస్తుందన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత ఎరువులను పొలాల్లో వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో నరసింహారావు పాల్గొన్నారు.

పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఏన్కూరు/తల్లాడ, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ భూ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం ఏన్కూరు తహసీల్దార్ కార్యాలయం, కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం తల్లాడ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఫైళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన భూ సమస్యల దరఖాస్తుల స్థితిగతులు, భూభారతి పోర్టల్ తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యల దరఖాస్తులపై నోటీసులు జారీచేసి భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం వాటి పరిష్కారానికి కృషిచేయాలని ఆదేశించారు. అనంతరం కస్తూర్బా బాలికల విద్యాల యంలో వంట గదులను డైనింగ్ హాల్, పరిసరాలను పరిశీలించారు. పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, కేజీబీవీ విద్యాలయం ఎస్‌వో లావణ్య తదితరులు పాల్గొన్నారు.



కేజీబీవీ విద్యాలయం బాలికలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

టీడీపీ ఆఫీసును సందర్శించిన నందమూరి రామకృష్ణ

వైరా, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ మంగళవారం రాత్రి వైరాలోని టీడీపీ కార్యాలయాన్ని సందర్శించారు. దమ్మపేట మండలంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం వైరా మండల పార్టీ కార్యాలయానికి రామకృష్ణ వచ్చారు. ఆయనకు టీడీపీ నాయకులు, అభిమానులు స్వాగతం పలికారు. రామకృష్ణను శాలువాతో సన్మానించారు. ఎన్టీఆర్ పేరుతో ఆఫీసు స్థలం రిజిస్ట్రేషన్ చేశామని, ఆఫీస్ నిర్మాణానికి ఏపీ మంత్రి నారా లోకేష్ ఆర్థికసాయం చేశారని వైరా టీడీపీ నాయకులు రామకృష్ణకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు చెరుకూరి చలపతిరావు, కిలారి సురేందర్, బొల్లేపల్లి శ్రీనివాసరావు, పమ్మి అర్జున్‌రావు, గుడ్ల నాగేశ్వరరావు, సూర్యదేవర వెంకటకృష్ణ, చావా కాంతారావు, కట్టా నర్సింహారావు, వై.భోగేశ్వరరావు, గాలి రామకృష్ణ, మన్నేపల్లి ప్రదీప్, పర్సా రామకృష్ణ, మద్దినేని రామారావు పాల్గొన్నారు.



వైరాలో నందమూరి రామకృష్ణను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

వర్షం వస్తే చాలు... ఇంటి ఆవరణలోకి నీళ్లు

సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్

బోనకల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వర్షం వస్తేచాలు.. ఇంటి ఆవరణలో మూడు అడుగుల లోతులో నీళ్లు నిలిచి ఉంటున్నాయని, సైడ్ డ్రైన్లు సక్రమంగా లేక పోవడం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్) గ్రామంలో ఓ యువకుడు సామాజిక మాధ్యమాల్లో పెట్టిన వీడియో వైరల్‌గా మారింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇళ్లల్లోకి సైతం నీళ్లు వస్తుండటంతో నానా అవస్థలు పడుతున్నట్లు గ్రామానికి చెందిన సాదం శ్రీను వెల్లడించాడు. ఈ సమస్యపై పలుసార్లు అధికారులకు చెప్పినా ఫలితం లేకపోయిందని శ్రీను కుమారుడు ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేశాడు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని మరోసారి అధికారులను ఈ సందర్భంగా వేడుకున్నాడు.



ఇంటి ఆవరణలో ఆగి ఉన్న వరద

మండలంలో పొంగి పొర్లుతున్న వాగులు

ఎర్రుపాలెం : మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతానికి ప్రయాణాలకు ఎక్కడా అంతరాయం లేకపోయినా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గురువారం ఉదయానికి లోతట్టు ప్రాంతాలు, గ్రామాలు రోడ్లన్నీ జలమయం అయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో తహసీల్దార్ ఉషాశారద, సామాజిక మాధ్యమాలలో అప్రమత్తం చేశారు.

ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వ భరోసా

ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

తల్లాడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం భరోసా కలిపిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. బుధవారం తల్లాడ మండలంలోని 24 గ్రామాల్లో పర్యటించి 113 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు ప్రభుత్వ, నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో చికిత్స చేయించుకున్న వారికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ప్రభుత్వ సహాయం అందించి ఆదుకుంటామని వివరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయానికి సహకరించాలని కోరారు. తల్లాడలోని పార్టీ కార్యాలయంలో ఎంపీ రేణుకాచౌదరి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల తిరుపతిరెడ్డి, కాపా సుధాకర్, సొసైటీ చైర్మన్ తూము వీరభద్రరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దివ్వెల కృష్ణయ్య, మాజీ జడ్పీటీసీ సభ్యులు మూకర ప్రసాద్, కె.వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ నాయకులు జక్కంపుడి కిషోర్, అడపా అనిల్, రాయల రాము, గణేశుల రవి, తుమ్మలపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నేడు మండలంలో డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ఎర్రుపాలెం, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటించనున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎర్రుపాలెం, రామచంద్రాపురం, పెద్దగోపవరం, బనిగండ్లపాడు, అయ్యవారిగూడెం గ్రామాల్లో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.4 కోట్లతో నిర్మించే సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎంఈవోగా మన్మోహన్‌రెడ్డి



ఏన్కూరు, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు ఎంఈవోగా జన్నారం జడ్పీహెచ్ పాఠశాల హెచ్‌ఎం జి.మన్మోహన్‌రెడ్డి నియమి తులయ్యారు. ఈ మేరకు బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి నాగపద్మజ నుంచి నియామక పత్రాలు అందాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్న రహీంబీ స్థానంలో మన్మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు.

బీమా చెక్కు అందజేసిన సొసైటీ చైర్మన్

ముదిగొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం సువర్ణాపురం గ్రామానికి చెందిన కనపర్తి లక్ష్మయ్య ఇటీవల మృతిచెందగా అతడికి ముదిగొండ సొసైటీలో సభ్యత్వం ఉంది. అతడి భార్య పార్వతికి రూ.50 వేల బీమా చెక్కును సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి బుధవారం అందజేశారు. రైతుల సంక్షేమానికి సొసైటీ కృషిచేస్తుందని ఆయన తెలిపారు.

అక్రమంగా మరుగుదొడ్డి నిర్మాణంపై విచారణకు కలెక్టర్ ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కల్లూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని ఐకేపీ కార్యాలయంలో ఇటీవల బదిలిపై వెళ్లిన ఓ ఏపీఎం నిబంధనలకు విరుద్ధంగా మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టిన సంఘటనపై గ్రామ సమైక్యలు ఇచ్చిన ఫిర్యాదుపై జిల్లా అధికార యంత్రాంగం స్పందించింది. దీంతో పాటు ఇటీవల ఆంధ్రజ్యోతిలో కూడా 'బాత్రూమా బడ్డీ కొట్టా' అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ స్పందించారు. ఈ మేరకు ఐకేపీ కార్యాలయ ప్రాంగణంలో నిబంధనలకు విరుద్ధంగా మరుగుదొడ్డి ఎలా నిర్మించారన్న సంఘటనపై విచారణ జరిపి నివేదిక పంపాలని కలెక్టర్ డీఆర్‌డీఏ పీడీకి ఆదేశించారు. దీంతో కల్లూరు ఎంపీడీవో చంద్రశేఖర్ ఐకేపీ కార్యాలయంలోని గ్రామ సమైక్యలను విచారణ చేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. గతంలో ఏపీఎంగా పనిచేసిన రాంబాబు గ్రామ సమైక్యల నుంచి రూ.36 వేలు వసూలు చేసి అక్రమంగా మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టగా, ఈ విషయమై గ్రామసమైక్యలు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించారు. ఉన్నత అధికారులతో సంప్రదించి ప్రభుత్వం తరుపున మరుగుదొడ్డి నిర్మించేలా చర్యలు తీసుకొంటామని చెప్పారు. గ్రామసమైక్యల నుంచి మరుగుదొడ్డి నిర్మాణానికి వసూలు చేసిన రూ.36 వేలు తిరిగి వాపసు ఇవ్వాలని ఎమ్మెల్యే రాగమయి గత ప్రజావాణిలో కల్లూరు ఏపీఎంను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం మండల పరిషత్ అధికారి ఐకేపీలో విచారణ జరిపి తగిన చర్యల నిమిత్తం నివేదికను జిల్లా అధికారులకు పంపనున్నట్లు తెలిసింది.

ఘనంగా రేణుకాచౌదరి జన్మదిన వేడుకలు

వైరా, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వైరాలో బుధవారం కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి జన్మదిన వేడుకలను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ మండల కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కట్ల రంగారావు రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డితో కలిసి కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మండలం లోని గొల్లపూడిలో ఉన్న వృద్ధాశ్రమంలోని వృద్ధులు, అనాథ పిల్లలకు అన్నదా నం చేశారు. రంగారావు మాట్లాడుతూ రేణుకాచౌదరి జిల్లా అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ బీడీకే.రత్నం, నాయకులు ఎస్‌డీ. అన్వర్, మిట్టపల్లి నాగి, కట్ల సంతోష్, నాగరాజు, ధార్న రాజశేఖర్, రేచర్ల నాగేశ్వరరావు, రాములు, గుత్తికొండ వీరబాబు, జాలాది రామకృష్ణ, గండేపల్లి కిషోర్, మేడూరి రామారావు, మిట్టపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న కట్ల రంగారావు, కాంగ్రెస్ నాయకులు

మాదకద్రవ్యాలు వినియోగిస్తే సమాచారం ఇవ్వండి : ఏసీపీ

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలు ఎవరైనా వినియోగిస్తే సమాచారం ఇవ్వాలని కల్లూరు ఏసీపీ ఏ.రఘు తెలిపారు. మాదక ద్రవ్యాల నిర్మూలపై బుధవారం స్థానిక జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల బారినపడి యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, వినియోగంపై సమాచారం ఇచ్చినట్లయితే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.గోపీ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతిజ్ఞ చేశారు.

మత్తు పదార్థాలకు యువత బానిసకావొద్దు

ముదిగొండ, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలకు యువత బానిస కావొద్దని ముదిగొండ ఎస్‌ఐ హరిత సూచించారు. బుధవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ముదిగొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. పోలీసుసిబ్బంది లక్ష్మణ్, ఉమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రాంతి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ర్యాలీ

వైరా, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వైరాలో బుధవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక ఠాగూర్ విద్యాసంస్థలకు చెందిన క్రాంతి జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞచేసి ర్యాలీ నిర్వహించారు. కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్, చైర్మన్ వాసిరెడ్డి సునీత, డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, ఎన్‌ఎస్‌ఎస్ పీవో లింగారావు, ప్రిన్సిపాల్ కృష్ణారావు పాల్గొన్నారు. అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎల్.నవీనజ్యోతి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు.

'విజయ'లో మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన

కొణిజర్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా సంక్షేమాధికారి రాంగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక విజయ ఇంజనీరింగ్ కళాశాల యందు బుధవారం మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రగ్స్ దూరంగా ఉండాలని తెలిపారు. డ్రగ్స్‌తో అనేక ప్రమాదాలు జరుగుతాయని వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ చిన్నయ్య, వైస్ ప్రిన్సిపాల్ అయేషాతరుణం, డీన్ శ్రీనివాస్, ఏవో ఫరీద్‌బాబా, జిల్లా మహిళా సాధికారకేంద్ర కోఆర్డినేటర్ సమ్రీన్, మానస తదితరులు పాల్గొన్నారు.